# పుణ్యభూమి

చావటం ఇంత తేలికని నేనెన్నడూ అనుకోలేదు.

ఎలా అనుకోగలను మరి ?

నేను అదృష్టవంతుణ్ణని చాలామంది అనేవారు ; అనుకునేవారు.

మంత్రులతోనూ, పెద్ద పెద్ద వాళ్ళతోనూ నిర్భయంగా మాట్లాడుతానట !

వాళ్ళు విసుక్కుంటున్నా లెక్కచేయకుండా ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి చంపుతానట !

వాళ్ళు హాజరైన, గొప్ప గొప్పవాళ్ళిచ్చే విందుల్లో నిర్భయంగా ప్రక్కనే కూర్చుని వాళ్ళతో కబుర్లు కొడుతూ' మరీ విందారగిస్తానట !

కాని, అలా అనేవాళ్ళకేం తెలుసు ? నా ఉద్యోగ ధర్మం నిర్వర్తించేందుకు నేను పడే పాట్లు !

ఆ రోజున మంత్రిగారిని ఇంటర్వ్యూ చేశాను.

మంత్రిగారు చాలా క్రొత్త సంగతులు సెలవిచ్చేరు.

రెండు బ్రహ్మాండమైన ప్రాజెక్టులూ, ఓ అరడజను మరీ అంత బ్రహ్మాండంకాని ప్రాజెక్టులూ అర్జంటుగా కట్టించాలని మంత్రివర్గం చేసిన నిర్ణయాన్ని గురించి తెలిపేరు.

విని నేను చాలా సంతోషించేను.

ఎందుకంటే ఈ వార్త ఇంకా బయటికి పొక్కలేదు. ఏ పత్రికీ్కి ఎక్కలేదు.

"ఎప్పుడుకట్టబోతున్నారు?" ప్రశ్నించేను మంత్రిగార్ని.

మంత్రిగారు క్షణ మాలోచించేరు.

"ఆ సంగతింకా నిర్ణయం కాలేదు. కాని, ఈ ఎలక్షన్లు వచ్చే లోగా శంకుస్థాపనలు జరగటం మాత్రం తథ్యం!" అన్నారు మంత్రిగారు.

మంత్రిగారు ఇంకా చాలా సంగతులు వివరించేరు.

వాటిలో కొన్నిటిని చెవినా, మరికొన్నింటిని కాగితానా వేసుకుని ఉత్సాహంగా బయటికొచ్చేను. కనుచూపు మేరలో ఎక్కడా రిక్షా అన్నది కనుపించలేదు.

మనస్సు ఉరకలు వేస్తూంది త్వరగా ఆఫీసుకు చేరాలని.

కాదా మరి! మంచి వార్తలు సంపాదించానాయె. అదికూడా అందరి కన్నా ముందుగా.

ఎడిటర్ తప్పకుండా మెచ్చుకుంటాడు. అసలే ఆయనగారి కిలాంటి వార్తలంటే మహాగౌరవం. కనీసం ఆరు కాలాల శీర్షిక పెట్టి మరీ వేస్తాడు.

పనిలో పని! అలవెన్సులు పెంచమని డబాయించటానికిదో మంచి అవకాశం.

మరి కొద్దిసేపటికి దూరం నుంచి వస్తూన్న బస్సును చూసి అవతలి పేవ్‌మెంటుమీది స్టాపింగుకు వెళ్ళటానికి నాలుగడుగులు ముందుకు వేశాను.

అది దుర్ముహూర్తమనిగానీ, ఆ క్షణాన ఓ పెద్దసైజు చిన్నకారు చప్పుడన్నా చెయ్యకుండా వచ్చి గుద్దేస్తుందేమోననిగాని నేననుకోలేదు.

అందుకనే అలా వచ్చి గుద్దేసినప్పుడు నేను అమాంతం చచ్చి ఊరుకున్నాను

నా మీదుగా ఆ కారు ఆగనన్నా ఆగకుండా రివ్వున దూసుకు పోయింది.

ఆ క్షణాన నోరారా ఓ చిన్న కేక వేయడానికన్నా టైం చాల లేదు. కనీసం పత్రిక్కి వార్త పంపటానికన్నా వీలు చిక్కిందిగాదు.

అప్పుడుగాని తెలీలేదు చావటం చాలా తేలికని. కాని, ఏం లాభం? తీరా చచ్చింతర్వాత తెలిసి వచ్చిందా సంగతి.

## 2

నాకు తెలివి వచ్చేసరికి ఆకాశ మార్గాన ఎగిరిపోతున్నాను. నేను పైకి పోతున్నాను. భూమీ, మేఘాలూ మహావేగంతో క్రిందికి దూసుకు పోతూన్నవి.

చల్లగాలి హాయిగా శరీరానికి తగుల్తూన్నది. ఇక్కడ గాలి ఉండ దనే వాడెవడోగాని ఎంత సుఖంగా, ఆనందంగా ఉందీ వాతావరణంలో.

కాని, మెడ దగ్గర మంట పుడుతోంది. బాధతో నరాలు జివ్వు మంటూన్నవి.

తడిమి చూసుకున్నాను. పటకాలాంటిదేదో మెడకు తగిలించివుంది దానికో ఇనప గొలుసు బిగించి వుంది. ఆ గొలుసు రెండో కొసను పట్టు కుని నా ముందు మార్గదర్శిలా గాలిలో తేలిపోతూ వున్నాడో భృడ కాయుడు.

"నువ్వెవరు? ఈ గొలుసేమిటి?" అని ప్రశ్నించేనాతణ్ణి.

"నేను యమకింకరుణ్ణి! ఇది యమపాశం!" అన్నాడతడు.

బుద్ధిమంతులూ, గొప్పవాళ్లూ నరకానికే వెళ్తారని ఆ మధ్య ఓ మహాకవి మరో మహాకవిని స్మరిస్తూ సెలవిచ్చిన సంగతి గుర్తుకొచ్చి పొంగిపోయేను.

కాని, మెడదగ్గర సలుపుతోంది.

యమపాశం నున్నని, మెత్తని స్పెషల్ పట్టుదారాలతో తయారై యమ ప్రయత్నానికి కూడా లొంగని కుచ్చుతో ఎంతో అందంగా, హుందాగా ఉంటుందని పురాణ గ్రంథాల్లో చదివాను.

తీరా వీడేమో కుక్కల మెళ్ళో తగిలించే గొలుసోటి తెచ్చి ఇదే యమపాశమంటున్నాడు.

నాకు సందేహం వేసింది. అంతలో కోపం ముంచు కొచ్చింది.

నిలవేసి వాడినే అడిగే నా సంగతి.

నా సందేహానికి వాడు మందహాసం చేశేడు.

వాడి నవ్వు అచ్చం యమకింకరుడి నవ్వులాగే ఉంది.

"అబ్బాయ్! నువ్వింకా పాత కథల్లోనే ఉన్నావు. పురాణకాలంలో యమపాశంగా పట్టుతాడు ఉపయోగించే వాళ్ళమనేది నిజమే. కాని, ఈ కాలపువాళ్లు ఇతర్ల తాడు సంగతలా ఉంచి తమ తాడే సునాయాసంగా తెంపుకోగలంతగా తెలివిమీరారు. అందుకే ముందు జాగ్రత్తకోసం గొలుసులు ఉపయోగిస్తున్నాం మేము" అన్నాడు వాడు.

ఆలోచించి నోర్మూసుకున్నాన్నేను.

అలా ఎగిరి వెళ్ళి, వెళ్ళి ఒక మహానగరంలోని మహాభవనంలో ప్రవేశించాము.

"నువ్విప్పుడు యమ దర్శనం చేసుకోబోతున్నావు!" అన్నాడు వాడు నన్నో గదిలోకి తీసుకుపోతూ.

నిజానికది గదికాదు. ఓ పెద్దహాలు. ఆ హాలు మధ్యగా ఉన్న ఓ విశాలమైన సోఫాలో అంతకు కొంచెం తక్కువ విశాలంగా వున్న ఓ భారీ వ్యక్తి కూర్చుని ఉన్నాడు. ఆ ప్రక్కనే కునికిపాట్లు పడుతూన్న నిగనిగలాడే నల్లని దున్నపోతునుబట్టి అతనే యమధర్మరాజయి ఉండాలనుకున్నాను.

సమీపించి చూసి తెల్లబోయేను.

"సుబ్బిగా!" అని ఒక్క పొలికేక వేశాను.

అతనూ ఉలిక్కిపడి అంతలోనే తమాయించుకున్నాడు.

ఒక క్షణం పరిశీలనగాచూసి దగ్గరగావచ్చి అమాంతం కౌగలించుకున్నాడు.

ఈ సుబ్బారావూ నేనూ చిన్నప్పటినుంచీ కలిసి చదువుకున్నాం. పెద్దయ్యేక ఒకే కాలేజీలో చదువుతూ, ఒకే హాస్టల్లో ఒకే గదిలో బ్రతుకుతూ ఒకే టేబుల్ మీద తింటూ గడిపేం.

హైస్కూల్ రోజుల్లో స్కూల్లోనూ, ఊళ్లోనూకూడా వాడంత మంచివాడు లేడని పేరుండేది. కాని, ఏ దుర్ముహూర్తాన కాలేజీ చదువుల కోసం పట్నంలో అడుగెట్టేడోగాని మనిషే పూర్తిగా మారిపోయేడు.

సంగతేమంటే మొదట్లో వాడు చాలా అభ్యుదయ భావాలు కలవాడు. పైగా బాగా తిట్టగల సామర్థ్యం గలవాడు. తత్ఫలితంగా పెద్ద

శ్రమేమీ లేకుండానే ఓసారి కాలేజీ యూనియన్‌కు ప్రెసిడెంటయ్యేడు.

ప్రెసిడెంటవటంతో వాడిలో అంతవరకూ వాడికే తెలీకుండా పెరుగుతూ వచ్చిన కీర్తిదాహం తగ్గటం మొదలెట్టి ఇతర దాహాలు పుట్టుకు రాసాగేయి.

అవి మొదట యూనియన్ నిధుల్ని భోంచెయ్యటంతో ఆరంభమై లెక్కలు చూపమన్న వాళ్ళకు జబ్బపుష్టి రుచి చూపటంతో ఉచ్ఛస్థితికి పోయేయి.

కాని, ఆశ్చర్యమేమంటే కాలేజీలో వున్నంతకాలం వాడి వ్యతిరేకులెంతగా గింజుకున్నా ప్రెసిడెంటుగా వాడికి తిరుగుండేదిగాదు.

కాలేజీ చదువు పూర్తయినాక నా దారిన నేను పోయేను. ఈ మధ్యలో ఏనాడూ వాడి సంగతులు నాదాకా రాలేదు. అలాంటిది ఇన్నాళ్ళకు వీడిని ఇక్కడిలా చూడటంతో చాలా సంతోషమయింది.

"ఇదేమిట్రా సుబ్బారావూ ! నీ విక్కడి కెందుకొచ్చావు ?'' అనడిగేను తోడొకడు దొరికాడుగదా అన్న ఆనందంతో.

వాడోసారి అనుమానంగా చుట్టూరా చూసి నా వంక తిరిగేడు.

"నన్నా పాతపేరుతో పిలువకు. ప్రస్తుతం నా పేరు యమధర్మరావు" అన్నాడు.

నే నాశ్చర్య పోయేను.

ఇంతలో నాకు సందేహం వేసింది.

నరకానికి బుద్ధిమంతులూ, గొప్పవాళ్ళు మాత్రమే వెళ్తారనిగదా ఆ మహాకవి ప్రవచించింది. మరి వీడు ఇక్కడికెలా వచ్చేడు ! అని

ఎంత గింజుకున్నా జవాబు అందలేదు.

బహుశా ఆ మహాకవి అలా నిర్వచించక ముందు వచ్చి ఉండ వచ్చును లెమ్మని సరిపెట్టుకున్నాను.

"నరకాని కొచ్చినా నీ ఆలోచనలు మాత్రం ఆగినట్టులేవే?" అన్నాడు వాడు.

"అబ్బే? మరేంలేదు. నీ పేరు మరీ కొత్తగా ఉన్నట్లుంటేను!" అన్నానేను.

"అదా! నే నీ ప్రాంతానికి యముడుగా ఎన్నికయిన తర్వాత ఈ కొత్తదోటి తగిలించుకోవా ల్సొచ్చిందిలే!" అన్నాడు వాడు.

"అయితే యమధర్మరాజు ఎప్పుడు చచ్చిపోయేడు?" అని ప్రశ్నించేను.

"యమ! యమా!" అని చెవులు మూసుకున్నాడు వాడు.

క్షణమాగి,

"నువ్వేదో బుద్ధిమంతుడివనీ, డొక్కశుద్ధి గలవాడివనీ నే ననుకుం టుండే వాడిని. కాని, యముడు చిరంజీవి అనే సంగతికూడా నీకు తెలిసి నట్లు లేదే!" అన్నాడు.

నా కొంచెం అవమాన మయ్యింది. అది కప్పుకునేందుకు దబా యించ సాగాను.

"నాకు తెలీదనుకోకు! అయితే యమధర్మరాజింకా బ్రదికుండ గానే నువ్వతని స్థానాన్నెలా ఆక్రమించావనేదే నా సందేహం!" అన్నాను

"నేనలా అనలేదే! కేవలం ఈ ప్రాంతానికి మాత్రమే నేను యముణ్ణి!"

"ఈ ప్రాంతమంటే?"

"సువిశాల నరకంలో ఇదొకభాగం మాత్రమే. ఇలాంటి ఉప నరకాలు ఇంకా కొన్ని వున్నాయి" అన్నాడు వాడు.

నేను అర్థం కావటంలేదన్నట్టు మొహం పెట్టాను.

ఇంతలో కాఫీ లొచ్చాయి.

"తీరిగ్గా అన్నీ చెప్తాగా! ముందు కాఫీ పుచ్చుకో!" అని కప్పు అందించేడు వాడు.

మంటపుడుతున్న మెడ తడుముకుంటూ కాఫీ చప్పరించ సాగేను.

3

కాఫీ చప్పరిస్తూ యమధర్మరావు ఛీత్కారం చేశాడు.

'వెధవ నరకం! పుల్ల బ్రాందీకన్నా గతిలేదిక్కడ! ఈ కాఫీ, టీలతో సరిపెట్టుకోలేక చస్తున్నాను!" అన్నాడు.

వీడు మంచి భోజనప్రియుడని తెలుసు! కాని, బ్రాందీప్రియుడు కూడానని యిప్పుడే తెలిసింది.

"ఏం! ఇక్కడకూడా నిషేధముందా?" అని ప్రశ్నించాను.

యమధర్మరావు పగలబడి నవ్వేడు.

"నిషేధమా! ఉంటే మాత్రం? అవన్నీ సామాన్యుల కోసం!" అన్నాడు హుందాగా.

"మరి?"

"సంగతేమంటే, ఇక్కడ దొరికే ముడివస్తువుల్తో మంచిసరుకే తయారుచేయవచ్చు. కాని తయారుజేసే ఫ్యాక్టరీలే లేవు. ఇప్పుడు తయారవుతూన్న సరుకుకన్నా చింతపులుసు చాలా నయం!" అన్నాడు.

"పోనీ, మనలోకంనుంచి తెప్పించుకోలేక పోయావా ?" అన్నాను సానుభూతిగా.

యమధర్మారావు విచారకరంగా తలపంకించేడు.

"అది సాధ్యమయ్యే పనిగాదు. మా అధికారాలు మనలోకంనుంచి వచ్చిన వాళ్ళను భద్రంగా మోసుకు రావటంవరకే పరిమితం !"

క్షణమాగి యమధర్మరావు అన్నాడు. "ఇదివరలో అంటే అడపా దడపా ఎవడన్నా బుద్ధిమంతుడు జేబులో బుడ్లు పెట్టుకుని మరీ ఏ కారు క్రిందో, కాలవలోనో పడిచస్తుండేవాడు. ఆ రోజు నాకు పండుగలా వుం డేది. ఇప్పుడదీ కరువయ్యింది. జేబులో సీసాలు పెట్టుకొని మరీ చావా లని ఏ వెధవకీ తోస్తున్నట్లు లేదు !"

ఇక్కడ అమృతమనీ, సోమరసమనీ మంచి సరుకులు చాలా దొరుకుతాయని విన్నానే ?"

ఆ పురాణాల్లో రాసినవన్నీ కోతలు. అమృతం స్వర్గంవరకే పరి మితం. ఇక్కడ తయారయ్యేదాన్ని గురించి ఇంతకుముందే చెప్పాను గదా ! దాన్నే 'యమరస' మంటారు.

"అలాగా !" అన్నాను.

"అవును ! పోతే మా యిరుగు పొరుగు సోదర నరకాల్లో కాస్త మంచి సరుకే దొరుకుతుంది. కాని, ఇప్పుడక్కణ్ణించి తెప్పించుకునే అవ కాశాలు తగ్గాయి."

"సోదర నరకాలంటే ?"

"అవీ యిలాంటివే ! రానురాను పాలనాభారం పెరిగి యమధర్మ రాజుగారిలా నరక విభజన చేసి వేర్వేరు నరకాలకు వేర్వేరు యమసభలూ

ఉప యముళ్ళూ వగైరా ఏర్పాటు చేశాడు. ఆయన కేంద్రంలో వుండి పీటిని గమనిస్తూంటారు.

"యమసభలంటే ?"

"మరేంలేదు. మన లోకంలో పార్లమెంటు ల్లాంటివే !"

"అయితే యిక్కడకూడా "యమసభ" వుందా ?

"ఉంది ! నేనే దానికి యముణ్ణి. సమయానికొచ్చావు నువ్వు. నా కిప్పుడు నీ అవసరం చాలావుంది. అందుకే నిన్ను యమసభకు నామినేటు చేద్దామనుకుంటున్నాను. యేం ! నీ కిష్టమేనా ?"

"అదెలా సాధ్యం. మీకు చట్టాలూ వగైరా ఏమీ లేవా !"

"ఉన్నాయనుకో : కానీ, మనకోసమే చట్టాలుగాని వాటికోసం మనం కాదుగదా !"

"మరి నన్నెలా నామినేటు చేస్తావు ? నేను కనీసం ఆంగ్లో - ఇండియన్ నన్నా కాదే !"

"ఆ సంగతి నాకు వదులు. దేశంలో నీబోటి పత్రికా విలేఖరులు కొద్దిమందే వున్నారు. అంతగా అయితే అల్ప సంఖ్యాకవర్గాల ప్రతినిధిగా నిన్ను నామినేటు చేస్తాను సరా !"

యమధర్మారావు సూత్రీకరణా నైపుణ్యానికి ఆశ్చర్య చకితుణ్న య్యాను. పీడికింత పదునైన బుర్రవుందని నేనూహించలేదు.

"అయితే యమసభా సభ్యుడుగా నేనేం చేయవలసి వుంటుంది ? నా కీ విషయంలో ప్రేక్షకానుభవమేగాని, ప్రత్యక్షానుభవం, ఏమీలేదే!" అన్నాను సందేహిస్తూ.

"ఈ అర్హతకు అనుభవంతో నిమిత్తం లేదు. అసలు పైకి రాదల

చిన వాడెవడూ అలా ఆలోచించగూడదు. నీవు యమసభకు హాజరవుతూ వుంటే చాలు. మేం ప్రవేశపెట్టే చట్టాలనూ, తీర్మానాలనూ చర్చల్లో నీవు ఎంత తీవ్రంగానైనా వ్యతిరేకించు. ఖండించి ముండనం చెయ్యి. అందుకు మాకేం అభ్యంతరం వుండదు. కానీ, ఓటింగు సమయాన మాత్రం నీ చెయ్యి నా పక్షాని కనుకూలంగా లేచి తీరాలి. అంతే!"

''అంతేనా?"

''అవును! కొన్ని కొన్ని సమావేశాలకు నువ్వసలు హాజరు కాక పోయినా నా కొంపేం మునగదు. నిన్నడిగేవాడూ ఉండడు అయినా ప్రతి ఘస్టుకూ మంచి జీతం. భత్యం ముడుతుంటాయి."

''అవికూడానా! ఈ మాత్రానికే?'' అన్నాను విస్మయంతో!

యమధర్మరావు సూటిగా నా కళ్ళలోకి చూశాడు.

"లేకపోతే ప్రజాసేవకే జీవితా లంకితం చేసిన మేమంతా ఎలా బ్రతుకుతా మనుకున్నావు? రేపటినుండి నీవుమాత్రం ఎలా బ్రతకగల వనుకుంటున్నావు?" అన్నాడు చివరిమాటను నొక్కి పలుకుతూ.

నిజమే ననుపించటానికి నా కెక్కువసేపు పట్టలేదు. ఈ యమ ధర్మరావు పూర్వాశ్రమంలో మా యూనియన్ నిధుల్ని భోంచెయ్యటానికి కూడా బహుశా ఇదే కారణ మయ్యుండా లనుకున్నాను.

అలా అనుకోవటంతో యమధర్మరావు పట్ల నా కిది వరలోగల సంశయాలన్నీ క్రమంగా తొలగి పోసాగాయి. అవును-మరి. ప్రజలచేత ఎన్నుకోబడి, ప్రజాసేవలో మునిగి తేలే మనిషి ప్రజల డబ్బుతోగాక మరెవడబ్బ డబ్బుతో బొజ్జ నింపుకోవాలి?

"ఏం! సందేహిస్తున్నట్లున్నావే!" అన్నాడు యమ ధర్మరావు కప్పులో ఇంకొంచెం కాఫీ పోస్తూ.

"కాదు, మీ యమసభా సభ్యులంతా ఇలా నామినేట్ చేయబడిన ప్రజాసేవకులేనా అని ఆలోచిస్తున్నాను!" అన్నాను.

"అంత అదృష్టముంటే నాకీ తలనొప్పు లెందుకు!" అన్నాడు యమధర్మరావు నుదురు కొట్టుకుంటూ!

"అదేమిటి?"

"ఈ వెధవలతో-అంటే ఈ యమసభా సభ్యులతో-వేగలేక చస్తున్నాను. అసలే ప్రతిపక్షాలవాళ్ళ గొడవలతో పిచ్చెక్కేలా ఉంటే కనీసం సానుభూతన్నా చూపకపోగా నా శిష్యులే నాకు గోతులు త్రవ్వుతున్నారు!" అన్నాడు యమధర్మరావు.

"ఏం? ఎందుకు?" అని ప్రశ్నించేను.

"మరేంలేదు. ప్రతి వాడికీ ఉన్న దురదే అది. ఎలాగన్నా నా దున్నపోతునెక్కి దాన్ని స్వంతం చేసుకోవాలనే వాళ్ళ తిప్పలన్నీనూ!"

"అందులో తిట్టుకోవాల్సిందేముంది!" అన్నాను.

యమధర్మరావు తెల్లబోయేడు. "నాతో హాస్యాలాడటాని కిదేనా సమయం?" అన్నాడు జాలిగా చూస్తూ.

"నేనేం సరసాలాడటం లేదు. గురుదక్షిణ క్రింద గురువుకు పంగ నామాలు దిద్దటం, శిష్యత్వానికి పరమావధిగా గురుపీఠాన్ని మ్రింగ జూడటం ఇవే ఈ యుగలక్షణాలు!" అన్నాను.

"అంటే వాళ్ళలా నాకు గోతులు త్రవ్వటం సక్రమమేనని నీ ఉద్దేశ్యమా?"

"సక్రమం అనటంలేదు. సహజం అంటున్నాను. వాళ్ళ ఎత్తుల్ని చిత్తుచేసి నీ దున్నపోతును కాపాడుకోవటం అనేది నాయకుడుగా నీ

బాధ్యత. ఆ మాత్రం తెలివి నీ దగ్గర నిలవవుండని పక్షంలో నీవీ యమ పదవికి అనర్హుడివన్నమాటే గదా !"

యమధర్మరావు ఆలోచనలో పడ్డాడు.

''అచ్ఛా !" అన్నాడు యమధర్మరావు అయిదు క్షణాల తర్వాత.

''ఏమో అనుకున్నాను, గట్టివాడవే ! నిన్ను యమసభకు నామినేటు చేయాలనుకోవటంలో నేనేమీ పొరపడ లేదన్నమాటే !'' అన్నాడు భుజం తడుతూ.

నేను కొంచెం ఉబ్బిపోయేను.

ఇంతవరకూ పత్రికా విశేఖరిగానే గాని రాజకీయ వేత్తగా నన్నెవరూ గుర్తించలేదు. ఇన్నాళ్ళకి యమధర్మరావు ఓ సర్టిఫికేటిచ్చాడు.

"ఇంతకీ నేనడిగిన వివరాలు చెప్పేవుగావు !" అన్నాను.

"ఆ బడుద్ధాయిాల సంగతా ! వాళ్ళను నరకవాసులే ఎన్నుకుంటారు !''

''బడుద్ధాయిాలంటావేమిటి ? మీ యమసభా సభ్యుల్ని అలాగే పిలుస్తారా ఏం ?'' అన్నాను తెల్లబోతూ.

''ఎబ్బే ! అంతమాటంటే ఇంకేమన్నా ఉందా. నువ్వేదో నా అంతరంగికుడివి గనుక నీ దగ్గర నోరు జారుతున్నాను. కొంపదీసి ఈ మాట లెవరిదగ్గరన్నా అనేవు !"

"నా సంగతా నీకు తెలియంది !"

"అవునవును. నీకున్నబుద్ధి ఆ బుడుద్ధాయిాలకుంటే ఎంత బాగుండును నాకీపాట్లు లేకపోనుగదా ! అప్పటికీ యమ సమితులనీ, పరిషత్తులనీ, అవనీ, ఇవనీ కొన్ని భారీ, కుటీర పరిశ్రమల్ని స్థాపించి చాలా

మందికి లాభసాటి పదవుల్ని ఏర్పాటుచేశాను. అయినా వీళ్ళకు కృతజ్ఞత గానీ, ఆశకు అంతంగానీ ఉంటేనా!"

యమధర్మరావు ఇబ్బందులకు లోలోపలే జాలి పడ్డాను.

"మరి ఎలా నెట్టుకొస్తున్నావు?" అని ప్రశ్నించాను.

యమధర్మరావు మందహాసం చేసేడు.

"శతకోటి ముఠాలకోసం అనంతకోటి పదవులని వెనకటి కెవడో నీబోటి వాడే గదా ప్రవచించేడు!"

ఇంతలోనే ఓ సందేహం వేసి దాన్ని బయట పెట్టేను.

"ఇన్ని ఎత్తులేయ గలిగిన వాడివి, ఇన్ని వలలు పన్నగలిగిన వాడివి కేవలం ఒక్క విస్కీబుడ్డి అన్నా దొరక్క గిజగిజలాడవలసి రావటం శోచనీయంగా లేదా" అన్నాను.

యమధర్మరావు విచారకరంగా తల పంకించాడు.

"అవునుమరి. యమధర్మరాజంతటి వాడికే దున్నపోతు వాహనం తప్పలేదు గదా! ఏం చెయ్యను!" అన్నాడు.

"మీ సోదర నరకాల్లో మంచి సరుకు దొరుకుతుందంటున్నావు గదా! మరెందుకు తెప్పించుకోగూడదూ!"

"అలా చేయబట్టే యీనాడిలా చుక్కకు గతిలేకుండావుంది. యీ సోదర నరకాల్తో ఓ చిక్కుంది. మా నోట్లు అక్కడ చిత్తుకాగితాల క్రింద జమ. ఇదివరలో అంటే అక్కడ మాకు చాలా నిల్వలుండేవి. కాని, నేను యముణ్ణయిన కొద్దికాలానికే అవన్నీ ఈ బుడ్లలాంటి వాటికోసమే నిండు కున్నాయి. ఏమన్నా మిగిలివుంటే అదికాస్తా దీని నల్లమందుకే సరిపో యింది!" అన్నాడు యమధర్మరావు ప్రక్కనే కునికిపాట్లు పడుతున్న

దున్నపోతును చూపుతూ.

నేను నిట్టూర్చాను.

"సరే! మరో అరగంటలో యమసభా సమావేశముంది. ఎలాగూ సభ్యుడివి కాబోతున్నావు. అక్కడి ఆచార వ్యవహారాలేమిటో ముందే తెలుసుకోవటం మంచిది. పద!" అన్నాడు.

"సరే" నంటూ లేచాను.

## 4

యమధర్మరావు కార్లో పోతూంటే అసలు ప్రయాణం చేస్తున్నట్లే లేదు. లోపల చల్లగా, మెత్తగా, హాయిగా వుంది. అదే యమధర్మరావు నడిగేను.

యమధర్మరావు వింతగా చూశేడు. "మరీ పల్లెటూరి బైతులా ప్రశ్నలు వెయ్యకు. ఈ కారు ఏర్ కండిషనింగ్ చేయబడింది!" అన్నాడు.

నేను చావకమునుపు ఇళ్ళు, సినిమాహాళ్లు ఏర్ కండిషనింగ్ చేయటాన్ని గురించి వినీ, చూసీ వున్నాను. కాని, ఇలాంటిది విన్నట్లు గుర్తులేదు. చూడగా చూడగా ఈ నరక వ్యవస్థ చాలా పురోగమించినట్లు కనుపిస్తోంది. అంతలో ఓ సందేహం వేసింది.

"మరి కార్లకే ఇంత హంగు చేసుకోగలిగినపుడు ఇందాక మనం యింటిదగ్గర వుక్కతో చస్తూ విసురుకుంటూ కూర్చోవాల్సిన ఖర్మ మేమిటి?" అన్నాను.

"అదా! నేను రాకముందున్న యముడికి ఆ కొంపను ఏర్ కండిష నింగ్ చేయించాలని తోచినట్టులేదు. తీరా నేనందుకు పూనుకునే సమయా

నికి సోదర నరకాల్లో మా నిల్వలు కాస్తా అయిపోయాయ్" అన్నాడు యమధర్మరావు.

"అయితే యీ మెషినరీ అంతా ఆ పాశ్చాత్య నరకాల్నుంచీ తెప్పించిన బాపతే నన్నమాట ! ఏం ! యిక్కడ తయారుకావా ?"

"ఇక్కడా !" యమధర్మరావు పగలబడి నవ్వేడు.

"యిక్కడి జనం వట్టి పూర్వాచారపరాయణులు. ఈ మధ్య ఓ పాశ్చాత్యసంస్థ వాయిదాల మీద ఏర్ కండిషనర్లు సప్లయి చేస్తానని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసినా ఒక్కడూ కొనిచావలేదు. వాళ్ళంతా వట్టివేరు తడకల్తోనో, విసనకర్రల్తోనో తమ యింటినీ, వంటినీ ఏర్ కండిషనింగ్‌లో వుంచుకుంటారు. ప్రాచీన సాంప్రదాయాల్ని మన్నించి, గౌరవించటంలో మా నరకపౌరుల్నే చెప్పుకోవాలి. అలాంటపుడు ఆ మిషన్లిక్కడ తయారుజేసి ఏం బాముకుంటాడే వ్యాపారస్తుడయినా ?"

"నీబోటి వాళ్ళ కెవరికేనా అవుసరం రాకపోవుగదా !"

"నిజమే ! కాని, ఆ పని చేయాలంటే కోట్లు ఖర్చుపెట్టి సోదర నరకాల్నుంచే ఫ్యాక్టరీలు కొనుక్కోవాల్సొంటుంది. మాకు బ్రాందీ బుడ్లకే గతిలేక చస్తుంటే వీటికోసం ఎన్నని తంటాలు పడగలం. అందుకని అవుసరమున్నపుడు ఒకటీ, అరా తెప్పించుకోవటమే మంచిదని వూరుకున్నాం.

"మరి మీ యింట్లో బిగించటానికి ఓ చిన్న ఏర్ కండిషనర్ కన్నా గతిలేదంటున్నావ్ !"

"గతి లేకపోవటంకాదు. కొనటానికి సోదర నరకాల్లో నిల్వలే లేవు. ఇక్కడైతే చచ్చేటంత డబ్బుంది. నోట్లు అచ్చు గుద్దటానికి

కావల్సినన్ని మెషిన్లున్నాయి. కాని, ఏం లాభం! యీ కాగితాలక్కడ చెల్లవు. అందువల్ల వాళ్ళు ఏర్ కండిషనర్లకు బదులు "మీ పౌరుల తల కాయలు తాకట్టు పెట్టండి" అంటున్నారు.

"మరి మీరేం చేశారు?"

"వాళ్ళంతగా మనవాళ్ళ తలకాయల మీద మోజుపడుతూంటే కాదనటం ఏం మర్యాద. అందుకని దొరికినన్ని పోగుజేసి వాటిని తాకట్టు పెట్టి ఓ రెండు ఏర్ కండిషనర్లు కొన్నాం".

"బాగానేవుంది స్కీము. కాని, ఇంతాచేసి రెండేనా వచ్చింది?" అని నా ఆశ్చర్యాన్ని ప్రకటించాను.

"అవును. సంగతేమంటే మా జనాభాలో యమ పూజారులంటూ ఓ వర్గం వుంది. వీళ్ళ సంఖ్య జనాభాలో నూటికి అయిదన్నాలేదు. కానీ, మా నరకవాసులంతా వీళ్ళకే తాకట్టుపడివున్నారు. మనుషులే వాళ్ళ దగ్గ రుండి పోయినప్పుడు మేమింక పోగుజేసేందుకు తలకాయ లేం మిగులు తాయి?"

"యీ అయిదారుగురూ ఏం జేస్తుంటారు?" అనడిగేను.

"వాళ్ళా, వాళ్ళలో ఒకడు మా యమధర్మరాజుగారి దున్నపోతు ముక్కుతాడు పట్టుకొని ముందుకు, వెనక్కు లాగుతుంటాడు. మరొకడా దున్నపోతుకు నల్లమందు మేపుతుంటాడు. మరొకడు చట్టాలూ, గ్రంథా తయారు చేయటంలో తోడ్పడుతూంటాడు. నాలుగోవాడు ఆ చట్టాలకు న్యాయంగా ఎన్నితూట్లు పెట్టవచ్చో, అన్యాయంగా మరెన్ని కన్నాలు పెట్టవచ్చో పరిశోధిస్తూంటాడు. ఇహ అయిదవవాడు వీళ్ళందరి తరఫునా ఆ తాకట్టుతోవున్న తలకాయల్ని కాపలా కాస్తుండటం, కొత్తవాటిని పోగు

చేయటం, వున్నవి చేజారిపోకుండా చూడ్డంలాంటి పనుల్లో ఫుల్ టైం వర్కర్‌గా పని జేస్తుంటాడు” అన్నాడు యమధర్మరావు.

ఇంతలో కారు యమ సభాభవనం ముందు ఆగింది.

“చూశావా” అన్నాడు యమధర్మరావు.

“ఏమిటి ?” అంటూ తలెత్తేను. యమధర్మరావు వ్రేలెత్తి చూపించేడు.

అటువైపుగా వరండాల్లో సిగరెట్ దమ్ముకొడుతూ, ఖుక్తాయా సంతో ఆపసోపాలు పడుతూ, తీరిగ్గా కూర్చుని హస్కుకొడుతూ అనేక మంది అగుపించేరు.

“ఏ ముందక్కడ ?” అని ప్రశ్నించేను.

“లేకేం ! వాళ్ళంతా ధృఢంగా, ఆరోగ్యంగా, ఆనందంగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారా లేదా ?” అన్నాడు యమధర్మరావు.

నేను మరోసారి పరిశీలనగా అటు చూశేను.

నిజంగానే యమధర్మరావు వర్ణించినట్లే ఉన్నారు వాళ్ళంతా ! అయితే అందులో విశేషమేమిటో నాకు తోచలేదు.

అ సంగతే యమధర్మరావు నడిగేను.

“నీకింకా అర్థంగాలేదా! వాళ్ళను చూశాకనన్నా మా నరక ప్రజలు ఎంత హాయిగా జీవిస్తున్నారో తెలియలేదా ? అన్నాడు.

“అదెలా ?” అన్నాను.

“మరేమనుకున్నావు ! వాళ్ళంతా యమ సభా సభ్యులూ, ప్రజా ప్రతినిధులూను ప్రజా ప్రతినిధులంటే ఏమిటి ? ప్రజా జీవితాన్ని ప్రతిబింబించేవాళ్లేగదా !” అన్నాడు యమ ధర్మరావు.

''అలాగా !'' అన్నాను.

''వాళ్ళ వేష భూషణాల్నిబట్టి చూడగా నరక ప్రజలు సుఖంగా, తృప్తిగా జీవిస్తున్నారనే అనిపించింది.

ఇంతలో యమధర్మరావు సెక్రటరీ వచ్చేడు. నన్నతని కప్పగించి యమధర్మరావు వందిమాగధు లనుసరించగా ముందుకు నడిచేడు.

ఆ సెక్రటరీ నాకు యమ సభా భవనమంతా చూపించి, విశేషా లన్నీ వివరించి, చివరికి విజిటర్స్ గ్యాలరీలో కూర్చుండబెట్టి సెలవు తీసుకుని వెళ్ళిపోయేడు.

గంట మ్రోగటంతో అంతవరకూ బయట కూర్చుని కబుర్లాడుతూన్న వాళ్లూ, పేకాటలో మునిగి ఉన్నవాళ్లూ ఒక్కొక్కరే లోనికి రాసాగేరు.

స్పీకర్ వచ్చి ముందున్న బల్లను మూడుసార్లు గుద్ది కూర్చోవటంతో సమావేశం శాస్త్రోక్తంగా ప్రారంభమయింది.

''ముందు ప్రశ్నోత్తరాలు !'' అన్నాడు స్పీకర్ మహాశయుడు.

కూర్చున్నవాళ్ళలోంచి ఓ పెద్ద మనిషి లేచేడు. గొంతు సవరించుకుని, కాలర్ సర్దుకుని, జేబూలోసారి తడుముకుని ప్రారంభించేడు.

''గౌరవనీయులైన ఆరోగ్యమంత్రిగారు తమ స్వంత వాడకం నిమిత్తం ఒకానొక పాశ్చాత్య నరకం నుండి నూట పాతిక పందుంపుల్లలు ప్రభుత్వ ఖర్చుతో తెప్పించుకున్నట్లు ఫలానా ఫలానా మనుష్యులు ఫలానా చోట పబ్లిగ్గా చెప్పుకుంటూన్న వార్త వాస్తవమేనా ? అయితే అందు నిముత్తం అయిన ఖర్చెంత ? ఎవడబ్బ సొమ్మని ఇలా ఖర్చుపెట్టటం జరిగింది ?'' అని ప్రశ్నించి కూర్చున్నాడు.

యమధర్మరావు లేచాడు.

"నా సహచరులైన ఆరోగ్య శాఖామాత్యులు అనారోగ్య కారణంగా నేటి సభకు రాలేకపోయారు. మహాశయా ! తమరి ప్రశ్నకు తరువాత జవాబివ్వగలను !" అని కూర్చున్నాడు.

మరో పెద్దమనిషి లేచేడు.

"అయ్యా ! మా ఊళ్లో పిల్లకాయలకి స్కూళ్లల్లో సీట్లు దొరక్క గాడిదల్ని కాసుకుంటున్నారు. కావాలంటే మా దొడ్లో పశువులకొట్టం ఖాళీగానే ఉంది. చవగ్గానే ఉంది. చవగ్గానే అద్దెకిస్తాను. అందులో ఓ స్కూల్ ఎందుకు పెట్టగూడదు ?" అని ప్రశ్నించేడు.

విద్యామంత్రిగారు శ్రద్ధగా చదువుతూన్న పుస్తకం టేబిల్ మీద గిరాటేసి బద్ధకంగా లేచారు.

"ఉన్నవాళ్ళకే ఉద్యోగాలు లేక చస్తుంటే ఇంకా క్రొత్త స్కూళ్లెందుకయ్యా స్వామీ !" అని కళ్ళజోడు సవరించుకున్నారు.

ఆ ప్రశ్నించిన పెద్దమనిషి ఏదో అనబోయి, అంతలో నోర్మూసుకూర్చున్నాడు.

మరొకరు లేచేరు. లేచీ లేవగానే బల్లగుద్ది "మా బామ్మర్దిగాడికి ఈ ఏడాది స్కాలర్‌షిప్ ఎందుకివ్వలేదు ?" అని గర్జించేరు.

మరో మంత్రిగారు లేచేరు.

"ఒరే ! మామా ! ఆ సంగతి సాయంత్రం తీరిగ్గా ఇంటి దగ్గర చర్చిద్దాంగాని ప్రస్తుతానికి ఊరుకోరా !" అన్నారు.

నాలుగో ప్రశ్న తీసుకోబడింది.

"మా ప్రాంతంలో ఈ ఏడాది సరిగా పంటలు పండక..."అంటూ

ఆ సభ్యుడు చెపుతూండగానే స్పీకర్ బల్లగుద్దేడు.

"ప్రశ్నోత్తరాల కాలం అయిపోయింది. ఇప్పుడు యమధర్మరావు గారు ఓ బిల్లును ప్రతిపాదించబోతున్నారు అన్నారు స్పీకర్ మహాశయులు.

యమధర్మరావు లేచేడు.

గొంతు సవరించుకుని గంభీరంగా ఉపన్యసించసాగేడు.

"మన నరకంలో మొయ్యలేనంత భూమి ఉంది. త్రాగలేనన్ని నీళ్ళున్నాయి. వచ్చినంతమంది జనం ఉన్నారు. పైగా ఏటేటా భూములు గల స్వాములకు కార్లుకొనుక్కొని, పొలాలు దున్నుకోమని అప్పులు కూడా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. అయినా ఈ నేల మీద పండే పంట మన జనంలో సగం మందికి కూడా చాలటంలేదనీ, అదనీ, ఇదనీ చాలామంది గొడవ చేస్తున్నారు.

"ఇదేదో మాయ ఉంది."

"ఏమా ? అని విచారణ చేయించేము."

ఆ విచారణవల్ల తెలిందేమంటే మనఖర్మ అలావుందిట. అందుకు మనం చేయగలిగిందేమీ లేదట. పోతే ఇందుకు తరుణోపాయం కని పెట్టాము. ఇటీవలి కాలంలో సోషలిజం అనే వాయుపదార్థం ఒకటి కని పెట్టబడింది. అది సర్వరోగ నివారిణి. ఆకలికూడా ఒక రోగమే. కనుక సోషలిజాన్ని అందరూ నిరభ్యంతరంగా భోంచెయ్యవచ్చు. కనుక మన నరకవాసులంతా వ్యవసాయ సంస్కరణల కోసం గోల చెయ్యటం మాని శుభ్రంగా సోషలిజాన్ని భోంచేస్తూ కాలక్షేపం చేయాలని ఓ చట్టం తయారుచేయ్యటం అత్యవసరం. ఈ చట్టాన్ని మీరంతా కళ్ళు మూసుకుని మరీ ఆమోదించగలరనే ఆశిస్తున్నాను" అని కూర్చున్నాడు.

ఓ సభ్యుడు లేచి "మన నరక చరిత్రలోనే ఇదొక విప్లవకర పరి ణామం. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన సుదినమిది.''అంటూ అరగంటసేపు అనర్గళంగా ఉపన్యసించేడు.

మరో సభ్యుడు లేచి''గౌరవనీయ సభ్యుని సూచనకు నేనొక సవరణ ప్రతిపాదిస్తున్నాను. సువర్ణాక్షరాలతో వ్రాయటమనేది మరీ బూర్జువాపద్ధతి. ప్రస్తుతం మనం సోషలిజం దిశగా దేకుతూన్న మహోన్నతస్థితిలోఉన్నాం. అందువల్ల రక్తాక్షరాలతో వ్రాయటం ఉత్తమోత్తమం." అన్నాడు.

మరో సభ్యుడు లేచి కొత్త చట్టంమీదా, యమధర్మరావు మీదా కలిపి పంచరత్నాలను ఆశువుగా గానం చేశాడు.

ఇంకో సభ్యుడు లేచేడు.

"అయ్యా, అంతాబాగానే ఉంటి. కాని,సోషలిజాన్ని దేంట్లో నంజు కుని జుర్రాలో సెలవిచ్చారుగాదు." అన్నాడు.

"పట్టిదే భోంచెయ్యొచ్చు." నన్నాడు యమధర్మరావు.

"అయితే ఆ సోషలిజం ఎక్కడ దొరుకుతుందో సెలవివ్వండి'' అన్నాడా సభ్యుడు.

"అదో వాయుపదార్థమని ముందే చెప్పేను, గాలిలోంచి విడ దీసేందుకుగాను, ఊరూరా పాకలు కట్టిస్తాం. మన రైతు కూలీలు యావ న్మందీ తమ తమ పొలాల్ని సద్బ్రాహ్మణులైన భూస్వాములకు దానం చేసేసి, వచ్చి ఆ పాకల్లో కూర్చుని సోషలిజాన్ని వండాల్సి ఉంటుంది'' అన్నాడు యమధర్మరావు.

"ఆ పాకలు ఎప్పుడు వేయిస్తారు ?'' అనడిగేడో సభ్యుడు.

"ముందు మన రైతులంతా దానపత్రాలు రాసేసి ఆ తర్వాత

మాకు మొరపెట్టుకోవాలి. అప్పుడు ఆలోచిస్తాం. అంతగా అయితే ఓ కమిటీ కూడా వేస్తాం" అన్నాడు యమధర్మరావు.

''మ్మొ...మ్మోసం...ద్ద...ద్దారుణం'' అని అరిచాడు సభ్యుడు కుర్చీలోంచి యెగిరిపడి.

ఆయన గడఘడా, దడదడా ఉపన్యసించసాగేడు.

''ఇదంతా ఓ కుట్ర. మా రైతుల్ని బికారుల్నిచేసి ఫ్యాక్టరీ కూలీలుగా మార్చే ఎత్తిది. యమధర్మరావుగారి ఘనమైన బుర్రలో ఇలాంటి విషప్పురుగులు లేవటం శోచనీయం. మేమీ చట్టాన్ని భూమట్టంచేసి తీరుతాము...'' అంటుండగానే స్పీకర్ బల్లగుద్దేడు.

''గౌరవనీయసభ్యుడు ఘనమైన నరకాధినేతను గురించి తెలీకమాటలు వాడుతున్నారు. కొంచెం నిగ్రహించుకోవాలి'' అన్నాను.

ఆ సభ్యుడు మరోసారి ఎగిరేడు. "మమ్మల్నిలా వెధవలి క్రింద జమకట్టి ఆయనగారిలా వాగుతూండగా మేమింకెలా మాట్లాడగల మనుకున్నావయ్యా మహానుభావా'' అన్నాడా సభ్యుడు.

''అదుగో, నా మాటకు ఎదురుకూడా చెపుతున్నారు. సరే, మహాశయా! తమర్ని సభ పూర్తయ్యే వరకూ బహిష్కరిస్తూన్నాను'' అంటూ గంట వాయించాడు స్పీకర్ మహాశయుడు.

''నువ్వేమిటి నన్ను బహిష్కరించట మేమిటి? నేనే నిన్ను బహిష్కరిస్తానుగాక'' అంటూ ఆ సభ్యుడు లేచి రెండు వ్రేళ్లూ నోట్లోదూర్చి గట్టిగా యీలవేసి మరుక్షణం బయటికి దూసుకుపోయేడు.

ఆ వెంటనే, ఆయన వెనుకనే మరి కొంతమంది లేచి అంతకన్నా వేగంగా సభ నుండి నిష్క్రమించేరు

అనంతరం అయిదున్నర నిమిషాలపాటు ప్రశాంతంగా జరిగిన చర్చలో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదింపబడి సభ వాయిదా పడింది.

ఆ మరుసటి సాయంత్రం తీరిగ్గా పేపరు తిరగ వేస్తూ కూర్చున్నాను.

ఇక్కడి యీ నరక పత్రికల్లో ఓ ప్రత్యేకతేమంటే వాటి భిన్నత్వంలోంచి కొట్టవచ్చినట్లు కనపడే ఏకత్వం.

దాదాపు అన్నింటా ఒకేరకం శీర్షికలూ, వార్తలూనూ. "యమ ధర్మరాజుగారు అక్కడ అలా ఉద్ఘాటించారు. ఇక్కడ ఇలా బల్ల గుద్దేరు. ఎక్కడో ఏమనో వాక్రుచ్చేరు" లాంటి సమాచారమంటే వీళ్ళకి అసక్తి జాస్తిలావుంది.

ఇంతలో నా ఏకాగ్రతకు భంగం కలిగింది. దూరంగా ఏదో చిన్న చప్పుడు మొదలై క్రమంగా పెరగసాగింది. ఏదో లెమ్మని ఉపేక్షిస్తున్నంతలోనే అది పెరిగి పెద్దదై నేనున్న హాలు పునాదులతో సహా పెకలించి వేయబడుతున్నట్లుగా దద్దరిల్లి పోసాగింది.

పేపరవతల పడవేసి గుమ్మం వద్దకువెళ్ళి చూశాను. భయంతో నిలువెల్ల వణికిపోయాను.

నరకంలో పిశాచాలుంటాయని నేను లోగడే చదివివున్నాను. కాని, వాటిల్లో ఒకటి ఇలా ఈ క్షణాన నా కెదురవుతుందని మాత్రం ఊహించ లేదు.

గుమ్మంగుండా దూరి రావాలని ఓ పిశాచాకారం యమ ప్రయత్నం చేస్తూన్నది. కాని, ఆ ప్రయత్నం ఫలితంగా గుమ్మం ఊడిపడేట్టున్నదే గాని ఆ ఆకారం మాత్రం ఇవతలికి రాగలిగేటట్లులేదు.

ఏనుగుకి నాలుగు కాళ్ళని విన్నాను, చదివాను, చూశాను. అందులో సందేహంలేదు.

కాని ఈ పిశాచం చూపులకు స్థూలంగా ఏనుగులాగే వున్నా కాళ్ళు రెండే వున్నాయి. తొండంగాని, తోకగాని అసలే లేదు. అన్నింటికీ మించి పంచకట్టి, చొక్కా తొడుక్కున్నది. నెత్తిన ఏదో కిరీట లాంఛనం వుంది.

నేను భయభ్రాంతుణ్ణయ్యాను. తోకముడిచి అక్కణ్ణించి ఉడా యిద్దామనుకున్నాను.

కాని, నాకు తోకలేదు. కనీసం నరకాని కొచ్చిన తరువాతనన్నా మొలవలేదు. అందువల్ల ఆ ప్రయత్నం మాని కాస్త నిదానించాను.

అంతలో యిది యమధర్మరావు యిల్లని గుర్తుకు వచ్చింది.

బహుశా యిది ఏ యమకింకరాకారమన్నా కావచ్చు. లేదా యమ ధర్మరావు బంట్రోతయినా కావచ్చు.

నేనో, యమధర్మరావు అంతరంగికుణ్ణి. కాబోతున్న యమసభా సభ్యుణ్ణి.

ఈ మాత్రానికే హడలిపోవటమా.

కూడగట్టుకున్న ధైర్యంతో "ఎవరది?" అని కేకవేశాను.

ఆ ఆకారం మెల్లిగా, జాలిగా మూలిగింది. దగ్గరకు రమ్మన్నట్టు సైగచేసింది.

తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో ముందుకు నడిచాను. సమీపించి చూసి కుదుటపడ్డాను.

అది దెయ్యమూగాదు, పిశాచమూగాదు. మనిషే.

పోతే, శరీరం నిలువుగా పెరగటానికి బదులు అడ్డంగా పెరిగింది అంతే.

"అబ్బ" అని మూలిగిందా ఆకారం.

''యీ యమధర్మరావుకు ఎన్నిసార్లు చెప్పినా యీగుమ్మం పెద్దది చేయించి చావడుగదా. నా మాటంటే వీడికింత లక్ష్యమన్నమాట'' అని గొణుక్కుందా ఆకారం.

నా కాయన బాధ అర్థమయింది. ఆయన మాటలలోని ఏకవచనాన్నిబట్టి చూడగా యీయనెవరోగాని యమధర్మరావుకు బాగా సన్నిహితుడిలాగే వున్నాడు.

"అబ్బే! అలాగాదండీ! గుమ్మాన్ని సూటిగా గాకుండా కాస్త అడ్డంతిరిగి దాటండి?" అన్నాను.

ఆయనలా చేసి ఎలాగైతేనేం గుమ్మందాటి ఇవతలపడి "హమ్మయ్య!'' అని నిట్టూర్చేడు.

"యమధర్మరావు లేడా ఏమిటి?" అనడిగేడాయన సోఫాలో జాగ్రత్తగా కూలబడుతూ.

''ఇంకా నిద్ర లేవలేదండీ!" అన్నాను.

''అలాగా! క్రొత్తగా ఈ లోకాని కొచ్చారట! పత్రికా విలేఖరులట! మీరేనాండీ?'' అని ప్రశ్నించేరాయన.

"అవును!" అన్నాను విస్మయంతో.

''మీ గురించి రాత్రి యమధర్మరావు చెప్పేడు. నేను యమపాలక పార్టీకి అధ్యక్షుడిని. నా పేరు వినాయకరావు." అన్నారాయన.

"అలాగా! చాలా సంతోషం" అన్నాను.

"నాకూను. ఎందుకంటే ఈ రోజునుంచి మీరు మా సహచరులు. రాత్రి యమధర్మరావు మీ గురించి బ్రహ్మాండంగా పొగిడేడు. మిమ్మల్ని మా యమసభా సభ్యుడిగా నామినేటు చేయాలని నిర్ణయించాం కూడా!" అన్నాడు వినాయకరావుగారు.

వినాయకరావుగారు చెప్ప సాగేరు.

"మా పార్టీ ఉంది చూడండి. అది ఘనమైన గత చరిత్ర గలది. మాకున్న బలం మరెవరికీలేదు. ఈ విషయంలో దానికదే సాటి" అన్నారు.

"గత చరిత్రేనా? ప్రస్తుత చరిత్ర అంటూ ఏమీ లేదాండీ" అని నా సంశయాన్ని వెలిబుచ్చేను.

"లేకేమి, చిరకాలంగా మాదే అధికారపార్టీ. మాకు పోటీగా ఇంత వరకూ బ్రతికి బట్టకట్టలేదు. కట్టిన ఒకరిద్దరు బడుద్ధాయిలూకూడా ఆ బట్టలు ఎప్పుడు జారిపోతాయోనని గుబులు గుబులుగానే ఉన్నారంటే మా తడాఖా అంటే ఏమిటో మీకు అర్థమయ్యే ఉండాలి."

"అంటే మీది ఏక పార్టీ నియంతృత్వ నరకమా స్వామీ, ఇక్కడ మరేం పార్టీలూ లేవా?"

రెండు చూపుడు వ్రేళ్లూ రెండు చెవుల్లోనూ దూర్చుకున్నారు వినాయకరావుగారు.

"యమ.. యమా...! అంతమాట అనకండి. నియంతృత్వానికి మేం బద్ధ వ్యతిరేకులం. ఇక్కడ మాదే గాక ఇంకా సవాలక్ష చిల్లర పార్టీలున్నాయి. కాని, సంగతేమిటంటే వాటిల్లో ఏ రెండు మూడింటికో తప్ప ప్రజల్లో బలమూలేదు, పలుకుబడీలేదు" అన్నారు.

"మరి, అ రెండు మూడింటి సంగతేమిటండీ?" అన్నాను.

వినాయకరావుగారు క్షణం సందేహించారు.

"మీరు నేడో రేపో మా పార్టీలోనూ, యమసభలోనూ సభ్యులు గాబోతున్నారు. మా ముఖ్య సలహాదార్లలో ఒకరు కాబోతున్నారు. కనుక మీకు సూటిగా, వాస్తవ విషయాలు వివరిస్తాను. వినండి" అంటూ ఉప క్రమించేరు.

"అసలు చిక్కంతా వీళ్ళతోనే వచ్చిపడింది. వాళ్ళ పలుకుబడి నానాటికీ హనుమంతుడి తోకలా పెరిగిపోతూంది" అన్నారు వినాయక రావుగారు.

"ఆ తోక తెగ నరక్క పోయారా?"

"నరకాలని యమతంటాలూ పడ్డాం. అయినా వాళ్ళ తోక మరింత పెరిగి అల్లరి చేయటం మొదలెట్టిందేగాని తరగలేదు."

"అలాంటప్పుడు నూనె గుడ్డలు చుట్టి నిప్పంటించి ఉండాల్సింది."

"మాకా మాత్రం తోచలేదనుకోకండి. కాని, ఆ నిప్పుతోనే మా కొంప తగలెట్టే ప్రమాదం కూడా ఉందనే సంగతి మరచి పోగూడదు!"

క్షణమాగి వినాయకరావుగారు తిరిగి చెప్పసాగేరు.

"మా నరక ప్రజలున్నారు చూడండి. వీళ్లొట్టి అమాయకులు. అందువల్ల మా వ్యతిరేకు లెవరేం చెప్పినా సునాయాసంగా నమ్మేస్తుం టారు. అదేం ఖర్మమో మేం మాత్రం వీళ్ళను నమ్మించడానికి వేషాలు వెయ్యలేక చస్తున్నాం!" అన్నారు.

"వేషాలేమిటి, అవెందుకండీ?" అని ప్రశ్నించేను.

వినాయకరావుగారు మందహాసం చేశారు.

"ఈ ప్రజలొట్టి అమాయకులని ముందే చెప్పేను. వాళ్ళను ఆక

క్షించాలంటే నాజూకైన వేషం వెయ్యాలి. ఇందుకుగాను మార్కెట్లో సోష లిస్టు డ్రెస్సనీ, సోషలిస్టు తరహా వేషమనీ, భూసంస్కరణా డ్రెస్సనీ, అదనీ ఇదనీ చాలా రకాల ముసుగులు దొరుకుతాయి. వాటిల్లో కొన్ని మేం మరెవరికీ మిగలకుండా కొనిపారేశాం. కాని తీరా తొడిగిచూస్తే అవి మా వంటికి సరిపడక బిగుతయ్యాయి. ఆ బిగుతు గుడ్డల్తో ముందుకూ ఊగలేక వెనక్కీ జారలేక బోల్తా పడుతున్నాం" అన్నారు.

"అలాంటప్పుడు అక్కడక్కడా కాస్త కుట్లూడదీసి వదులు చేసు కోవాల్సింది" అన్నాను.

"కాస్తేం ఖర్మ! బాగానే ఊడదీసి వదులుచేసేం. కాని ఎప్పు డయితే ఓ కుట్టు ఊడబీకామో ఆ వెంటనే మిగతావి వాటంతటవే ఊడటం మొదలెట్టాయి."

"మంచిదేగదా! కాస్త ఊపిరి తీసుకోటానికన్నా వీలుంటుంది" అన్నాను.

"అదీ నిజమే. కాని, మా కా డ్రెస్సులు మినహాయిస్తే లోపల కనీసం అండర్‌వేర్లన్నాలేవు. దాంతో మా పరువు కాస్తా నగ్నంగా ప్రజల కళ్ళబడ్డది."

నేను మౌనం వహించాను.

వినాయకరావుగారు అందుకున్నారు.

"పరువు బజార్నపడినా మాకేం లెక్క లేదనుకోండి. అలాంటి పట్టింపులకు మేం అతీతులం. కాని, ఆ తర్వాత జరిగిన ఎలక్షన్లలో ఎన్నడూలేని బొప్పెలు తగిలేయి. మా సోదర నరకాల్లోని మా సోదర యముళ్ళు కొందరు నామ రూపాల్లేకుండా పోయేరు. ఇప్పుడే ఇలా ఉందే!

రేపెలా ఉంటుందోననే మేం నిద్రకూడా పోలేకుండా ఉన్నాము!''
అన్నారాయన.

"దేనికయినా ఏదో ఓ చిట్కా ఉండక పోతుందాండీ!" అన్నాను.

"అవునవును. యమధర్మరావు కూడా ఇలాగే అంటూంటాడు. అదుగో! మాటల్లోనే వచ్చేడు. రావోయ్! రా! నీకు మరో వెయ్యేళ్ళాయుష్షు!" అన్నారు వినాయకరావుగారు నా తలమీదుగా చూస్తూ.

నేను వెనక్కి తిరిగి చూశేను. యమధర్మరావు అప్పుడే లేచినట్లున్నాడు. కళ్ళు నులుముకుంటూ వచ్చి నా ప్రక్కనే సోఫాలో కూలబడ్డాడు.

"వెయ్యేళ్ళాయుష్షు ఎందుకండీ!" ఇప్పటికే నానా చావుగానూ ఉంటేను! అన్నాడు విసుగ్గా.

'శాంతించవోయ్! శాంతించు నీకేం లోటు గనుక. యమభోగా లనుభవిస్తున్నావు గదా ఈ పదవిలో!" అన్నారు వినాయకరావుగారు.

ఏం భోగాలు లెండి. దిన దిన గండంగా తయారవుతుంటేను! అన్నాడు యమధర్మరావు.

కాసేపాగి తిరిగి ప్రారంభించేడు. మీ శిష్యులున్నారు చూడండి. వాళ్ళి మధ్య నా మీద ఆరోపణలు చేస్తూ యమ ధర్మరాజుగారికి పిటీషన్లిచ్చారట గదా! మనమంతా ఎవరే మనుకున్నా లెక్కచేయకుండా ఇంత కాలం ఒక కంచంలోని అన్నమే వంతులు వేసుకు తింటూ ఐకమత్యంతో నెట్టుకు వచ్చిన వాళ్ళం గదా! మరిప్పుడిలా అలిగి కూర్చోవటం ఏం న్యాయం చెప్పండి!''

అలాగా నా కింకా ఈ సంగతే తెలీదు సుమా అన్నారు వినాయకరావుగారు దిక్కులు చూస్తూ.

మీకు తెలీకపోవట మేమిటండీ! ఈ సంగతి ఇప్పటికే నలుగురి నోళ్ళల్లోనూ పడి పత్రికలక్కూడా ఎక్కితేనూ!

"కావచ్చు! కాని, వీళ్ళీమధ్య మరీతెలివి మీరి పోతున్నారు. ఇంతకీ వాళ్ళిప్పుడు నా శిష్యులు కాదు. వేరే గ్రూపు పెట్టుకుంటామంటూ గొడవ చేస్తున్నారు నీకూ తెలుసనుకుంటాను.

తెలుసనుకోండి; కాని, ఎలక్షన్లు దగ్గరవుతున్నాయి గదా! ఈ సమయంలోనా ఇలా కొంపలు తగలెట్టేట్టు ప్రవర్తించటం.

అసలు నే నొచ్చిందీ ఆ సంగతి చర్చించేందుకే మరి ఏమన్నా ఆలోచించావా?

ఏమో నాకేం పాలుబోవటంలేదు. ఎటుచూసినా ఆ ప్రాజెక్టు కట్ట లేదనీ, ఈ ఫ్యాక్టరీ తగలెట్టలేదనీ ఒకటే గొడవలాయె. ఈ స్థితిలో మన గతేమవుతుందో తెలీకుండా ఉంది. అన్నాడు యమధర్మరావు.

మధ్యలో నేను కలుగజేసుకున్నాను.

ఈ మాత్రానికి ఇంత ఆలోచనెందుకు? ఒకటి రెండు ప్రాజెక్టులూ ఒకటీ అరా ఫ్యాక్టరీలూ కట్టేస్తే పీడా విరగడవును అదేమంత కష్టం గనుక అన్నాను.

యమధర్మరావు బరువుగా నిట్టూర్చేడు.

నన్నేం చావమన్నావా ఎంత డబ్బొచ్చినా ఈ దున్నపోతు సల్ల మందుకే చాలటంలేదే. మా యింట్లో ఎర్ కండిషనర్ పెట్టుకుందామన్న గతిలేకుండా ఉందే. ఇంక ప్రాజెక్టుల కెక్కణ్ణించి తెమన్నావు అన్నాడు ప్రక్కనే కునికిపాట్లు పడుతూన్న దున్నపోతువంక జాలిగా చూస్తూ.

నేను మౌనం వహించేను.

సినిమా వాళ్ళున్నారు గదటోయ్ అన్నారు వినాయకరావుగారు హఠాత్తుగా.

ఉంటేనేమండీ వాళ్ళవల్ల గిట్టే పన్నులన్నీ యమధర్మరాజుగారి ఖజానాకే పోతుండే అన్నాడు యమధర్మరావు.

పన్నుల సంగతిగాదు నే చెప్పేది తాత్కాలికంగా వాళ్ళచేత ఓ రెండు మూడు ప్రాజెక్టుల సెట్టింగులూ, ఓ నాలుగయిదు ఫ్యాక్టరీ సెట్టింగులూ వేయించి ఈ గండం ఎలాగన్నా గడపలేమా అని.

యమధర్మరావు సోఫాలోంచి ఎగిరిపడ్డాడు.

ఎంత గొప్ప అయిడియా అండీ మీది నాకింతవరకూ ఈ సంగతే తట్టింది గాదు. అంటూనే అంతలో నల్లబడిపోయేడు. కాని. మనపాలిటి రాహువుల్లా ఈ ప్రతిపక్షాల వాళ్ళున్నారే అదీగాక ఈకాలం జనం ఆవులిస్తే డొక్కలోని బొమికెల్నే గాక అందులోని మున్నాన్నికూడా తూకం వేయ గలిగినంతగా తెలివిమీరి ఉన్నారే వీళ్ళ కళ్ళని సెట్టింగుల్తో కప్పగలమా అని.

అయితే కుదరదంటావా ?

ఇదివరలో అయితే ఏమోగాని ఇప్పుడదేం లాభంలేదండి అన్నాడు యమధర్మరావు.

వినాయకరావుగారు బరువుగా నిట్టూర్చేరు.

మరి మన ఈ బడుద్దాయీ గాళ్ళని మంచి చేసుకుని మళ్ళీ నిల దొక్కుకునే అవకాశమేమీ లేనట్లేనా ?

యమధర్మరావు నుదురు బాదుకున్నాడు. మీ రసలే లోకంలో ఉంటున్నారో నా కర్థంగావటం లేదండి వినాయకరావుగారూ. మొన్నీమధ్య

మీ శిష్యులూ, నా శిష్యులూ కలసి జాయింటు మీటింగు జరుపుకుని నూరు ఆరయినా, యమధర్మరాజు దిగివచ్చినా సరే వచ్చే ఎన్నికల్లో మనమంతా వేరే పోటీచేసి తీరుదాం అని ఓ తీర్మానంకూడా చేసిన సంగతి మీకు తెలిసినట్టే లేదే.

వినాయకరావుగారు ఉలిక్కిపడి సోఫాలోంచి ఎగిరిపడ్డారు.

నిజంగానే ఎప్పుడన్నారు? ఎన్ని గుండెలతో అన్నారు. ఎవరితో పోటీ చేస్తామంటున్నారు? అంటూ ప్రశ్నలమీద ప్రశ్నలు గుప్పించ సాగేరు.

యమధర్మరావు ప్రశాంతంగా జవాబిచ్చాడు.

"ఎవరితోనో అయితే మనకేమండీ. వాళ్ళు మనల్ని మన్నుతినిపించాలనే ఈ పట్టుదలలన్నీనూ. అడ్డమైనవాళ్ళూ కలిసి కాపురం పెట్టటమూనూ."

వినాయకరావుగారు ఏదో గొణుక్కున్నారు. "వాళ్ళనసలు ఈ స్థితికి తెచ్చింది మనమ్. నువ్వేమో అడిగిన వెధవకల్లా పర్మిట్లూ, కంట్రాక్టులూ యిచ్చి బాగా మేపావాయె. యింకేం! కళ్ళు నెత్తికొచ్చి కూచున్నాయి" అన్నారు

"బాగుంది. మేపమని మొదట సెలవిచ్చినవారు తమరేనాయె."

"అవుననుకో. కాని, యిలాగ మేపమన్నది ముందుకాస్త పచ్చి గడ్డి రుచిచూపించి గాట్లో కట్టేసి, తరువాత ఎండుగడ్డి మాత్రం మేపమంటినే."

"యిబ్బందిమాత్రం గమనించవద్దా. వాళ్ళు పచ్చగడ్డికి అలవాటు పడి తర్వాత ఎంత మొత్తుకున్నా ఏండుగడ్డి మూచూడరందే."

"అప్పుడే దుడ్డుకర్రతో నాలుగంటిస్తే సరిపోయేదిగదా."

"అంత తేలికగా అనకండి వినాయకరావుగారూ. అంతపనీ జేస్తే రేపెప్పుడో జరగబోతూందని మన మిప్పుడనుకుంటూన్నది ఆనాడే జరిగి వుండేది. వాళ్ళేం పిల్లకాయలు కాదుమరి. అయినా అదంతా యిప్పుడను కుని ఏంలాభం. గత్యంతరం ఆలోచించండి" అన్నాడు యమధర్మరావు.

"ఏమో. నాకేం తోచటంలేదు." నిస్పృహగా మూల్గేరు వినాయక రావుగారు.

"నా కొకటి తోస్తూందండీ. ఈ ఎలక్షన్లు ఓ పాతికేళ్ళపాటు వాయిదా వేస్తే సమస్య విరగడవుతుం దనుకుంటాను."

వినాయకరావుగారు విస్మయంతో యమధర్మరావును వీక్షించేరు. క్షణం ఆలోచించేరు

"మరి, నలుగురూ అడిగితే ఏమని చెప్పుకునేది ?" అన్నారు.

"దానికేముందండీ కారణాలకేం. సవాలక్ష చెప్పొచ్చు, యిప్పట్లో ఎలక్షను జరపటానికి ఖజానాలో డబ్బులేదంటే సరి."

"అంత మాత్రాన వాళ్ళు ఊరుకుంటారా ?"

"ఊరుకోకపోతే ఎలక్షన్ సెస్ అంటూ ఓ కొత్త పన్ను వెయ్య బోతున్నామని ప్రకటిద్దాం దాంతో ప్రభో ! మాకీ ఎలక్షన్లు వద్దని వాళ్ళే ఆందోళన మొదలెడతారు" అన్నాడు యమధర్మరావు.

"బాగానేవుంది. కాని, ప్రతిపక్షాల వాళ్ళు ఖజాన నిల్వ లెక్కలు చూపమంటే మన కొంప మునుగుతుందేమో."

"ఏడిశారు అంతగా అడిగితే అలాగే చూపిద్దాం. నిజానికేమన్నా నిల్వంటూ వుంటేగదా."

''అవుననుకో? కాని, సోదర సరకాల్లో మన పరువు పోతుంది గదా.''

"పరువు... పరువు... వెధవ పరువు ఎవడిక్కావాలండీ. మన క్కావాల్సింది ఏదో ఇలా పదికాలాలపాటు బ్రతగ్గలగటం. అందుకోసం ఏం చేస్తేనేమి" అన్నాడు యమధర్మరావు చిరాగ్గా.

వినాయకరావుగారు జాలిగా యమధర్మరావు కళ్ళలోకి చూశేరు.

''నీ వనేది నిజమే. కాని, మనపైన యమధర్మరాజుగారంటూ ఒక రున్నారని మర్చిపోతున్నావు'' అన్నారు.

''అవును. ఏం చేద్దామన్నా ఇదో పీడగా వుంది. లేకపోతే ఈ సరికి ఈ వెధవల్నందర్నీ కొలుముల్లోకి తోయించి వుందును'' అంటూనే నాలుక్కరుచుకుని చుట్టూరా చూశేడు యమధర్మరావు.

"పోనీ, నేనొకటి చెపుతా వింటావా?" అన్నారు వినాయకరావు గారు.

ఏమిటన్నట్లు చూశేడు యమధర్మరావు.

"ఈ మధ్య మన సోదర నరకాల్లో కొన్నింట్లో జరిగిన మార్పులు చూశావుగదా.''

''ఏ మార్పులు?''

''అదేనోయ్. మన సమీప నరకంలోనూ, సుదూర సోదర నరకంలోనూ జరగలా!''

''అయితే...?'' అన్నాడు యమధర్మరావు విస్మయంతో.

''అలాగే ఇక్కడా మన తలారి రామన్నని ప్రోత్సహించి యమసభలు రద్దుచేసి వాడి పాలన ప్రవేశపెట్టిస్తే ఎలా వుంటుందంటావు?"

యమధర్మరావు ఖిన్నుడయ్యేడు.

ఈ ఎలక్షన్ల పీడ వదలటం సంగతలావుంచి ముందుమా పదవు లన్నీ ఊడుతాయండీ వినాయకరావుగారూ" అన్నాడు ఏడుపు మొహంతో

"అయితేనేం ఆ స్థితి కొద్దికాలమేగా. అసలు గొడవలు మరుగున పడగానే మళ్ళీ నువ్వే పెత్తనం మొదలుపెట్టవచ్చు."

"ఆ నమ్మక మెక్కడిదండీ వినాయకరావుగారూ. వాడు మనల్నందర్నీ జైళ్ళలో కుక్కి తానొక్కడే మిగలడని నమ్మకమేమిటి?"

"అబ్బే వాడలా చేస్తాడనుకోను. చాలా విశ్వాసపాత్రుడు" అన్నారు వినాయకరావుగారు

"మన శిష్యుల్ని గురించీ అలా అనుకునే యిప్పుడిలా విచారిస్తూ కూర్చున్నా మనేది మీరు మరచిపోతున్నారు" అన్నాడు యమధర్మరావు.

"అయితే తలారి రామన్నతో మన కిప్పుడేంపని లేదంటావా?"

"అబ్బే. నా బొందిలో ప్రాణముండగా అలా జరగనివ్వను. మరీ మీకింత మోజుగావుంటే ఈ ఎలక్షన్లలో నేను ఓడిపోయే పక్షంలో అలాగే వాడి కప్పగిద్దురుగాని. అందాకా ఆ తిప్పలేవో నన్నే పడనివ్వండి" అన్నాడు యమధర్మరావు ఆవేశంతో.

"బాగుంది. నీ కిష్టంలేని పని నేనుమాత్రం ఎందుకు చేస్తాను. మరి ఈ గండం గడిచేదారేదో నువ్వే ఆలోచించు" అన్నారు వినాయకరావుగారు.

కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దంగా ఉండిపోయే రిద్దరూ.

"నా కొకటి తోస్తూందండీ" అన్నాడు యమధర్మరావుహఠాత్తుగా.

"మనం చాలాకాలం క్రితమే సోషలిజమే మన లక్ష్యమనీ, అదెక్కడున్నా దాని పిలకపట్టి లాకొచ్చి ప్రజల కప్పగిస్తామనీ ప్రకటించాం గదండీ."

"అవును'' అన్నారు వినాయకరావుగారు.

''కాని ఇంతవరకూ దాని పిలక సంగతలా ఉంచి అసలదెక్క-డుందోకూడా పట్టుకోలేక పోయాం."

"ఆ సంగతి నువ్విప్పుడా కనిపెట్టింది?''

''అదికాదండీ నేననేది, మనమిప్పుడిలా ఈ ఎలక్షన్లను గురించి తన్నుకు చస్తున్న దెందుకంటారు!''

''ఎందుకేమిటి, పోటీ చేస్తున్నాం గనుకా. గెలవకపోతే బ్రతకలేం కనుకా.''

''అంటే గెలవలేమేమోననే భయంతోనేగదా ఈ చీకాకులన్నీనూ?"

"నీ దుంపతెగా, ఆ మాట బిగ్గరగా అనకు'' అంటూ వినాయక రావుగారు ఓసారి చుట్టూరా చూసి "అయితే ఏమంటావు?" అన్నారు.

"ఎందుకు గెలవలేమంటారు?" ప్రశ్నించాడు యమధర్మరావు.

''ఎందుకేమిటి, మన ప్రతిపక్షాల వాళ్ళుత్త దొంగ ముండావాళ్ళు, గారడీ వాళ్ళూను. వాళ్ళు జనాన్ని మభ్యపెట్టి మనకు వ్యతిరేకంగా త్రిప్పు కుంటున్నారు. అందుకనే"! అన్నారు వినాయకరావుగారు.

యమధర్మరావు విసుగ్గా కదిలేడు.

"వినాయకరావుగారూ, మనమిప్పుడు పబ్లిక్ మీటింగులో మైక్ ముందు నుంచుని ఉపన్యాసమివ్వటంలేదు. కేవలం మనమిద్దరం ఇక్కడ ఇలా కూర్చుని కాస్త ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందువల్ల మీరు కొంచెం సదానించాలి" అన్నాడు.

''అయితే ఏమంటావు."

"మనం జనానికి సోషలిజాన్ని వండి వడ్డించి, నంజుకోడానికి

సోషలిస్టు తరహా సైడు కూరలుకూడా పెడతామన్నాం. అదుగో వంటయి పోయింది. ఇదుగో వడ్డించేశాం. అంటూ హడావిడి చేశాంగాని ఇంత వరకూ ఏమీ వండనూలేక పోయాం, వడ్డించనూలేకపోయాం. అందుకనే ప్రజలు మనల్ని నమ్మటం మానేసి ప్రతిపక్షాలవారి వెంట పడుతున్నారు! కాదంటారా?"

"నిజమే ననుకో" అన్నారు వినాయకరావుగారు బరువుగా.

"అందువల్ల మనమిప్పుడు కనీసం ఓ టన్ను సోషలిజాన్నన్నా వండి ఈ జనానికి రుచి చూపించకపోతే వీళ్ళు చచ్చినా మనల్ని నమ్మరు. అంతేగదా ?"

"నాకూ తెలుసు ననుకో. కాని, అదెలా వండాలో తెలీకేగదా ఈ తిప్పలన్నీనూ."

"తెలీకపోవట మేమిటండీ, ఎన్నడో వండాముగదా! ఫార్ములా కుదిరి పాకం చిక్కగానే తయారయినా ఆ కంపు భరించలేక నిలువు లోతు గొయ్యితీసి పాతిపెట్టాంగాని మనకది వండటమే చేతగాదనటం అవ మానకరం గాదా ?"

"అవునవును" వంత పలికేరు వినాయకరావుగారు.

"అందువల్ల దాని రుచీ, కంపూ ఎలా తగలడినా కనీసం ముక్కు మూసుకుని అయినా ఎంతో కొంత సోషలిజాన్ని మనం అర్జంటుగా వండితీరాలి."

"ఇప్పుడా, మనకంత తీరికెక్కడిదని."

"మీరు కొంచెం జాగ్రత్తగా వినాలి. సోషలిజాన్నంతా మన పొయ్యిలోనే వండుదామని నేననటంలేదు. కొద్దిగా మాత్రం వండుదా మను

కుంటున్నాను" అన్నాడు యమ ధర్మరావు.

"ఎలా వండుతావు?" ప్రశ్నించేరు వినాయకరావుగారు.

"ఎలా ఉండాలనేది తేల్చేముందు మనం అసలు సోషలిజం అంటే ఏమిటి? దానికి తలకాయెక్కడ? పిలకెక్కడ? తోకెక్కడ? ఈ అనుపానులన్నీ స్టడీచేస్తే తర్వాత దాని పిలక లంకించుకోవటం తేలికేగదా!"

"అవును."

"ఇప్పుడు జాగ్రత్తగా వినండి. మన పొరుగునున్న సోషలిస్టు నరకాల్లో ప్రతిపక్షాలంటూ ఏమీలేవని మీకూ తెలుసుననుకుంటాను"

"నాయనా! నన్ను మరీ కుర్రకుంక క్రింద జమకట్టకు. ఈ దారుణ విషయాన్ని గురించి మనం మన జనానికి దాదాపు ప్రతి మీటింగులోనూ చెప్పి కన్నీళ్ళుకూడా పెట్టుకుంటున్నాం."

"అదే! అక్కడే మన మింతకాలం పొరబడుతూ వచ్చింది. అది నియంతృత్వం అనటం కాస్త తొందరపాటే, కాని, అది సోషలిస్టు లక్షణాల్లో ఒకటండీ వినాయకరావు గారూ!"

"అలాగా!"

"అందువల్ల మనమిప్పుడు ఒక్క దెబ్బకు రెండు పిలకల్ని నరకగల మహత్కార్యానికి పూనుకోవాలి."

"ఏమిటది?"

"ఏముంది, ప్రతిపక్షాలను నిషేదిద్దాం."

"ఎందుకు?"

"ప్రభో! తమరు కాస్త నిదానంగా ఆలోచించాలి. అలా చేశామా మనంకూడా సోషలిజాన్ని వండి, వార్చటం మొదలెట్టినట్లవుతుంది. అది

మొదటిది. రెండోది ప్రతిపక్షాల పీడ విరగడవుతుంది. ఏ దిక్కుమాలిన వాడన్నా ఇదేమిటంటే మీ మాతృనరకంలో ఏం జరుగుతుందో చూసి మరీ మాట్లాడవయ్యా అందాం. మరి వాళ్ళు నోరు మెదపలేరు" అన్నాడు యమధర్మరావు ఉత్సాహంగా.

''అచ్ఛా'' అన్నారు వినాయకరావుగారు సోఫాలోంచి ఎగిరిపడి.

"నీ బుర్ర ఇంత ఘనమైనదని నే నెన్నడూ అనుకోలేదు సుమా! ఎంత గొప్ప అయిడియా. ఈ లెక్కన కలకాలం ఈ నరకం నాదే. యమ పీఠం నీదే! ఎంత గొప్ప అయిడియా, ఎంత గొప్ప అయిడియా. కాని ...కాని...'' అంటూనే ఆనందోద్రేకంతో మూర్ఛపొయ్యేరు.

యమధర్మరావు మంచినీళ్ళకోసం లోపలికి పరుగెత్తేడు.

నేను కణతలు నొక్కుకుంటూ యమాంజనం కోసం బయటకు పరుగెత్తేను.

## 6

ఉదయంనుంచీ కడుపు నొప్పితో చస్తున్నాను. యమధర్మరావు భోజన ప్రియుడని ముందే చెప్పేను. ఆ భోజన ప్రియత్వం సామాన్య మైనదేంకాదు. నా కన్నా ఎన్నో రెట్లు సునాయాసంగా భోంచేసి కూడా కనీసం త్రేన్పనన్నా త్రేన్చడు!

అందులో విశేషమేం లేదు. కాని, నన్నుకూడా తనను చూసి నేర్చుకోమనటంతోనే వచ్చింది అసలు చిక్కంతానూ!

"నీ కిక్కడి సంగతులేం తెలియవు'' ఇక్కడ నిలవగలగాలంటే, అందులోనూ పదవిపోకుండా బ్రతగ్గలగాలంటే బుర్ర పుష్టి ఉన్నంత

మాత్రాన్నే చాలదు. కండ పుష్టి కూడా దండిగా ఉండాలి!'' అంటాడు యమధర్మరావు.

త్వరలో యమసభా సభ్యుడివి కాబోతున్నవాడివి. కనుక త్వర త్వరగా అందుకు కావలసిన అర్హతలను సంపాదించుకోవటం మంచిది అని కూడా సూచించేడు.

అందులో అతిగా భోంచెయ్యటం ఒకటి!

నే నసలే బక్కవాడినేమో! తిన్నది తేలిగ్గా భరాయించుకో లేక పోయేను. తత్ఫలితంగా ఉదయం నుంచీ బాధతో మెలి దిరిగి పోతున్నాను.

చెప్పుకుందామన్నా యమ ధర్మరావు లేడు. ఉదయమనగా రాజ ధాని శివారుల్లో కాలవ గండిని పూడ్చే పనికి ప్రారంభోత్సవం చేయ టానికని వెళ్ళినవాడు ఇంతవరకూ అంతులేడు.

అందుబాటులో ఉన్న యమధర్మరావు సెక్రటరీతో నా బాధ చెప్పుకున్నాను.

అంతా విని అతగాడో చిరునవ్వు విసరేడు.

మేం ఎంత భోంచేసినా ఇంకా, ఇంకా ఆకలేస్తుంటుందేగాని అజీర్తి ఎన్నడూ రాలేదు. అందుకనే మాకు మందుల్ని గురించి కూడా ఏమీ తెలీదు! అన్నాడతను.

చేసేది లేక కడుపు చేత్తో నొక్కుకుంటూ వీధిన పడ్డాను.

అలా పోయి, పోయి ఓ యింటి ముందున్న బోర్డునూ, బోర్డుమీది పేరుకు ముందున్న ''డాక్టర్'' అనే అక్షరాల్నీ చూసి ఆగిపోయేను.

ఇతనెవరో పేరునుబట్టి చూడగా తెలుగు వాడిలాగే ఉన్నాడు. దగ్గర్లోనే హాస్పటల్ పెట్టాడు. పుణ్యాత్ముడు! అనుకుంటూ లోపలికి పోయేను.

"దయచెయ్యండి !" అంటూ ఆహ్వానించే డాయన.

బాధను అణచుకుంటూ కుర్చీలో ఆసీనుణ్ణయ్యేను.

"దయచేసి ఓ అయిదు క్షణాలు ఓపికపట్టాలి !" అంటూ ఆయన ముందున్న ఓ లావుపాటి పాత బైండులోంచి కాపీ చేసుకునే తన కార్యక్రమాన్ని పునః ప్రారంభించేడు.

ఇంతలో లోపల్నించి కాఫీలొచ్చేయి. ఓ కప్పు నా ముందుకు తోసేడాయన. సందేహిస్తూనే తాగాను.

అరక్షణం తర్వాత ఆశ్చర్య చకితుణ్ణయ్యాను.

ఈ మహానుభావుడు కేవలం కాఫీతోనే కడుపు నొప్పిని వదలగొట్టాడే అనుకుంటూ హాయిగా కుర్చీలో వెనక్కు వాలేను.

"సుబ్బిశెట్టిగారు క్షేమమే గదా" అన్నారాయన బైండును మూసి ప్రక్కన పెట్టి కాగితాలు సర్దుకుంటూ.

"ఏ సుబ్బి శెట్టి ?" అన్నాను తెల్లబోతూ.

''మీరు విలేఖరులే గదా ?'' అనడిగారాయన సందేహిస్తూ.

నేను నిన్నగాక మొన్న నరకాని కొచ్చినవాడిని నా కీర్తి అప్పుడే ఈయనదాకా ఎలా వ్యాపించిందా అని ఆశ్చర్యపోయేను.

అవునండీ అన్నాను సవినయంగా.

మరలా అంటారేం మీ యజమానిని గురించే అడుగుతున్నాను. అన్నారాయన.

మా యజమాని పేరు సుబ్బిశెట్టి కాదండీ ! అన్నాను.

అయితే మీరు ఏ పత్రికకు విలేఖరులు ప్రశ్నించేరాయన.

నేను దానికి మునుపు విలేఖరినేగాని, ఇప్పుడే పత్రికలోనూ పని చేయటం లేదండి అన్నాను.

అలాగా అన్నారాయన. మరిక్కడి కెందు కొచ్చేరు ?

"మందు కోసమండీ"

మందేమిటి ? అన్నారాయన నొసలు చిటిస్తూ.

నేను సంగతి సందర్భాలు వివరించేను.

ప్రొద్దుటినుంచీ కడుపునొప్పి విపరీతంగా ఉందండి అన్నాను.

అంతా విని "నేను డాక్టర్నని నీ కెవడు చెప్పేడు ? నన్నవమానించటంకోసం నిన్నెవరో ఇలా పంపినట్లున్నారు" అన్నారాయన ఆగ్రహంతో.

నా కంతా అయోమయ మయ్యింది.

అలాగంటా రేమిటండి ! బయట బోర్డుమీద మీరు డాక్టరని ఉంది. పైగా ఇందాక మీరు ఇచ్చిన కాఫ్యౌషధంతో నా కడుపునొప్పి మాయ మయ్యింది కూడాను అన్నాను.

కావచ్చు కాని, నేను డాక్టరునేగాని వైద్యుడినిగాను అన్నారాయన.

"అంటే"

"నే నీ మధ్య యముడి దున్నపోతు నల్లమందు లేందే ఎందుకు నడువలేదు ? నల్లమందు—మరియు దాని అద్భుత గుణములు" అనే విషయంపై వెయ్యిన్నర పేజీల పరిశోధనా వ్యాసం తయారుజేసేను. అందుకుగాను మా యూనివర్శిటీ వాళ్ళి డాక్టరు డిగ్రీ ఇచ్చేరు. ఆ సంగతి నలుగురికీ తెలిసేందుకని బోర్డుమీద వ్రాయించేను. అదీ సంగతి" అన్నారాయన.

అని లేచేరు.

"ఇప్పటికే నా సమయం చాలా వృథా అయింది. తమరింక దయ చేయవచ్చు" అని సెలవిచ్చేరు.

''అయితే మా యమధర్మరావునూ, వాడి దున్నపోతునూ తమరు బాగా స్టడీచేసే రన్నమాట" అన్నాను లేస్తూ.

''మా, అంటున్నారు. ఆయనగారు మీకు బంధువులు కాదుగదా?" అన్నారు ఆయన సందేహిస్తూ.

"కాదుగాని, వాడూ నేనూ చిన్నపుడు గోలీ లాడుకున్నాం. పెద్ద వాళ్ళమయాక పేకాడుకున్నాం" అన్నాను.

ఆయనగారి మొహంలో రంగులు మారేయి.

"చెప్పారు కాదేమండీ! కూర్చోండి...కూర్చోండి" అంటూ షేక్ హ్యాండిచ్చి కూర్చోబెట్టేరు.

''విచిత్రంగానే అయినా మనం కలుసుకోగలగడం చాలా సంతోష కరం. నేనిక్కడి నరక సంస్కృతీ అకాడమీ స్థాపకుడిని. మీరూ కళా కారులే కావటం సంతోషదాయకం" అన్నారాయన.

''పొరపడుతున్నారు. నాకే కళలోనూ ప్రవేశంలేదండీ. కేవలం ఓ పత్రికా విలేఖరిని మాత్రమే. అది కూడా నేను చచ్చి ఇక్కడకు రాక పూర్వం సంగతి" అన్నాను.

"అయితే మాత్రం మా అకాడమీలో కవులు, రచయితలు, చిత్ర కారులు, గాయకులు, నటులు అందరూ వున్నారు. విలేఖరులు మాత్రం ఎందుకుండగూడదు. అది మాత్రం ఒక కళగాదా, అందులోనూ మీరు యమధర్మరావు అంతరంగికులు కూడాను'' ఆయన బల్లగుద్ది మరీ వాదించ సాగేరు.

నన్నూ ఓ కళాకారుడుగా గుర్తించి, నరక మేధావుల జాబితాలో పడేసినందుకు నాకూ ఆనందమయింది.

"ఇందాక మీరేదో సుబ్బిశెట్టిగారి విషయం ప్రస్తావించారే. ఆయ నెవరండీ" అన్నాను.

"ఆయనా! ఆయన్నెరుగని వారెవ్వరు. మన నరక సాహిత్యాన్నుద్ధరిస్తున్న పత్రికలు దాదాపు అన్నీ ఆయనివే. ఆయనిచ్చిన విరాళాలకూ, ఆయన పోషణ క్రిందవున్న సాహితీ పరులకూ అంతేలేదు. ఆ మధ్య నన్నొక వ్యాసం అడిగారు. ఇవాళ ఎడిటర్ని పంపుతామన్నారు. అందుకే యిందాక మిమ్మల్నిచూసి పొరపడ్డాను" అన్నారాయన.

"మంచి పత్రికలే ననుకుంటాను" అన్నాను.

''అవును. మంచివి కాకపోతే నేనెందుకు వ్రాస్తాను. అసలీ నరకంలో సుబ్బిశెట్టిగారి పత్రికలకున్న ప్రచారంలో వందోవంతయినా యితర పత్రికల కున్నదా? ఆహా! ఏమి రంగులు, ఏమి కాగితం; ఏమి ముద్రణ. మీకు కావాలంటే వారి వద్ద మంచి ఉద్యోగం దొరకవచ్చు, ఆయనా, యమధర్మరావూ బహుసన్నిహితులు'' అన్నారు డాక్టరుగారు.

ఇంతలో సన్నగా, పొడుగ్గా వున్న ఓ వ్యక్తి "నమస్కారం డాక్టరుగారూ" అంటూ లోపలి కొచ్చేడు.

"ఓ నువ్వుటోయ్ రా వ్యాసం కోసమేగదా రావటం. సుబ్బిశెట్టిగారు క్షేమమేగదా" అంటూ ఆహ్వానించేరు డాక్టరుగారు.

"ఆయనకేం రోగమండీ. ఆ మధ్య పంటినొప్పివస్తే ఓ వెలి గేషన్లో వేయించుకుని విమానం మీద పాశ్చాత్య నరకాలూ పర్యటించి దార్లో పన్ను పీకించుకుని మరీ వచ్చేరు" అన్నాడా వ్యక్తి చిరాకుగా.

''ఆయన పేరెత్తగానే మీరిలా మరీ పచ్చిమిరపకాయలు నమలటం ఏమంత భావ్యంగాలేదు. హాయిగా బిజినెస్ చేసుకుంటూన్న పెద్దమనిషి

అదలా కొడుకుల కప్పగించి ఇక్కడ ఇలా దిక్కూ దివాణం లేకుండా పస్తులుంటున్న మిమ్మల్ని, అటు మన నరక సంస్కృతినీ ఉద్ధరించటం కోసం ఇన్ని తిప్పలు పడుతూ యిన్ని పత్రికల్ని లాక్కువస్తున్నాడనే కృతజ్ఞత అన్నా వుండవద్దా?" అన్నారు డాక్టరుగారు

"ఏం పోషించటం లెండి. మాకూ మా పత్రికల్లో పనిచేసే వర్కర్లకూ ఆయనగారి దృష్టిలో ఏం తేడావుంది గనుక."

"అదుగో. అక్కడే మీరు తప్పటడుగు వేస్తున్నారు. మిమ్మల్ని వర్కర్లతో పోల్చుకుంటున్న వాళ్ళు మీరే. రోడ్డు కూలీల్లా సంఘాలు పెట్టుకుని అదికావాలనీ, ఇది పెంచాలనీ యాచనలోకి దిగిందీ మీరే. మరి మన పెద్దలేంచేశారు. కడుపు కాల్తున్నా ఎవర్నీ దేబిరించకుండా అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించేరు గదా. దానికున్న విలువ ఈనాటి సాహిత్యానికున్నదా'' మీరంతా సమాజంలో వున్నత వర్గానికి చెందినవాళ్లూ, మేధావులూను. మరి మీరిలా అది కావాలనీ, ఇది పెంచాలనీ, యాచించటం అసహ్యాకరంగాదా" అన్నారు డాక్టరుగారు.

''ఏం ఉన్నతి అండీ డాక్టరుగారూ. మేం చేస్తున్నది కూలీపని గాక మరేమిటి? ఉన్నత ప్రమాణాలనేవి ఏనాడో వైతరణిలో కలిశాక యింకా మనమూ ఉన్నతిని గురించి గుటకలు మింగటం దేనికి? ఆ మధ్య ప్రతిపక్షాల వాళ్ళు అంతా కలిసి ఓ సభ జరుపుకుంటే డానికి నన్ను రిపోర్టర్‌గా పంపమని మా ఎడిటర్ చెపితే ఆ మహానుభావుడు సెల విచ్చాడు గదా ''ఎందుకు ఛార్జీలు దండుగ. ఆ రాసేదేదో యిక్కడ కూర్చునే వ్రాయలేడా" వాళ్ళలో వాళ్ళకు అంగీకారం కుదరలేదనీ, చివరికి ముష్టియుద్ధం చేసుకోగా ముగ్గురికి ముక్కు చిట్లిందనీ, నలుగురికి మూతి చిరిగిందనీ వ్రాసెయ్యమను సరిపోతుంది'' అన్నారు. మరి నేనేం వ్రాయక

చావనా" అదీ మా పున్నతి అన్నాడతను ఆవేశంగా.

డాక్టరుగారు కాస్త తగ్గేరు.

''అవును ! డబ్బు దగ్గర కాస్త పట్టుగా వుంటాడు నిజమే. కాని... కాని...సరే ! అదలా వుండనీ. ఇదుగో వ్యాసం. ఇది కాస్త ప్రముఖంగా వచ్చేట్లు చూడమని ఎడిటర్‌తో నా మాటగా చెప్పు" అన్నారు డాక్టరు గారు కాగితాలందిస్తూ

అవందుకుని అతను నాలుగడుగులు వేసేటంతలో డాక్టరుగారు వెనక్కి పిలిచేరు.

''చూడూ. యిలాంటి చిన్న విషయాలు ప్రతిసారీ మీకు గుర్తు చేయవలసి రావటం ఏంఖర్మ ! మొన్నటి యమ గోష్టిలో నే చేసిన మహో పన్యాసాన్ని క్లుప్తంగా ఓ మూల వేసి, వాడు...వాడు...ఆ వెధవాయ గాడి ఊకదంపుడుని మాత్రం పూర్తిగానూ, ప్రముఖంగాను అచ్చు గుద్దారే. వాడు నా కన్నా ఏ విధంగా గొప్ప వెధవని ?" అన్నారు డాక్టరుగారు కాస్త చిరుకుగా.

"మేమేం చెయ్యం డాక్టరుగారూ ! ఆ మహానుభావుడు తన ఉప న్యాస పాఠం చంకనేసుకుని తెల్లారకుండానే స్వయంగా మా ఆఫీసుకు దయచేశారు. దగ్గరుండి కంపోజు చేయించి స్వయంగా ప్రూఫులు దిద్దిగాని మమ్మల్ని వదలందే" అన్నాడతను.

"సరే. ఈ సాయంత్రం యమ గోష్టిలో నేనూ వుంటానని తెలు సుగా. ఈసారన్నా కాస్త జాగ్రత్తగా తగలడమని చెప్పు'' అన్నారు డాక్టరుగారు.

అతనలా వెళ్ళగానే చిరునవ్వుతో నావంక తిరిగేరు డాక్టరుగారు.

"ఈ వెధవ గొడవల్తో మిమ్మల్ని విసుగెత్తించి నట్లున్నాను'' అంటూనే వాచీ చూచుకుని ''ఇక్కడికి దగ్గర్లోనే నా అధ్యక్షతన యమ సాహిత్యగోష్ఠి జరుగనున్నది. టైమవుతూంది మీరూ వస్తారనుకుంటాను" అంటూ లేచేరు.

"నాకూ వేరే పనేంలేదు. కాస్త కాలక్షేపమన్నా అవుతుంది. పదండి" అన్నాను. దారిలో డాక్టరుగారు ఎంతో ఓపిగ్గా నా సందేహా లన్నింటికీ జావాబు లిచ్చేరు.

''మా నరక సాహిత్యం వుంది చూడండి. అది సుసంపన్న మైనట్టిది. ఈ రంగంలో సోదర, పాశ్చాత్య నరకాలకు మేమేం తీసి పోము. ఆ సంగతి వాళ్ళుకూడా గుర్తించేరు" అన్నారు డాక్టరుగారు.

''మీరు కార్యదర్శిగా వున్న నరక సంస్కృతీ అకాడమీ గురించి సెలవిచ్చారుగారు'' అన్నాను.

"ఆయనగారు ఓ నస్యం పట్టువేసి ఉత్సాహంగా ఉపక్రమించేరు.

"స్థాపించిన అనతికాలంలోనే అపూర్వమనదగిన కృషి జరిపేం మేము. సాహిత్యమనగా సాహిత్యమేనని మా దృఢాభిప్రాయం. సైరపీలూ, స్వంత డబ్బాలూ నిర్వహించుకోలేని అసమర్థులు మా సంస్థ ఛాయలకు రావడానికి కూడా అనర్హులేననేది మా దృఢనిశ్చయం. ఈ రెండూ మా మూల సూత్రాలు" అన్నారు డాక్టరుగారు.

ఇంతలో సూటూ, బూటూ వేసుకున్న ఓ ఆఫీసరు లాంటి పెద్ద మనిషి మాకు అడ్డం వచ్చేడు.

"ఓ డాక్టరుగారా! మొన్నటి సభలో మీ ఉపన్యాసం గురించి ఏమని చెప్పమసార్! అలాంటిది నభూతో నభవిష్యతి. ఏమి విజ్ఞానం...

ఏమి విజ్ఞానం...ఏమి వాగ్ధార" అంటూ తుఫానులా పొగడ సాగేడు.

నేను తెల్లబోవటం చూసి డాక్టరుగారు ఆయన్ని నాకు పరిచయం చేశేరు.

"వీరు మా సంస్కృతీ రంగ మూలస్థంభాల్లో ఒకరని చాలామంది సర్టిఫికేట్లిచ్చేరు. వీరు దాదాపు అరడజను సాంస్కృతిక సంస్థలను యమ దక్షతతో నిర్వహిస్తున్నారు. పూటకో సభ, నెలకో సాంస్కృతికోత్సవ జరిపించటంలో వీరికి వీరేసాటి."

ఆ క్రొత్తాయన సగౌరవంగా, సహకారంగా అభివాదం చేశేడు.

కుశల ప్రశ్నలయ్యాక "చూడండి డాక్టరుగారూ! మా క్రొత్త సంస్థ గ్రాంటు విషయం మరచిపోయినట్లున్నారు. ఆ కాగితాలింకా వీః టేబుల్ మీదనే నలుగుతున్నాయట" అన్నాడా కొత్త వ్యక్తి.

డాక్టరుగారు తల పంకించేరు.

"ఏ సంస్థ విషయం? మీరు చెప్తూంట?" అని ప్రశ్నించేరు.

"అలాగంటే యేం చెప్పను డాక్టరుగారూ! ఆ అప్లికేషన్ నేనే స్వయంగా తమ చేతి కిస్తిని గదా. నిన్నగాక మొన్ననేగదా మా సమితికి సాక్షాత్తూ యమధర్మరావుగారు ప్రారంభోత్సవం జరిపింది. పత్రికలన్నిం ట్లోనూ వివరంగా రిపోర్టులు కూడా వచ్చాయిగదా. ఆ కటింగులు కూడా తమకు సమర్పించుకొంటినిగదా! గ్రాంటు తప్పక వచ్చేలా చేస్తానని తమరే సెలవిస్తిరిగదా ఆ రోజున! అప్పుడే మరచి పోయారా?" అంటూ ఆ వ్యక్తి బేలమొహం పెట్టుకుని ప్రశ్నించేడు.

డాక్టరుగారు కొంచెం తడబడ్డారు.

"జ్ఞాపకం లేక కాదండీ! మీరు మాట్లాడుతున్నది మీ అరడజను

కంపెనీల్లో దేన్ని గురించో తెలీక అలా అడిగాను. మరేమనుకోకండి. యింతకీ యీ క్రొత్త సంస్థను ఎక్కడ పెట్టారో సెలవిచ్చారుగాదు" అన్నారు డాక్టరుగారు.

ఆ పెద్ద మనిషి పరాకుగా జేబులు తడుముకున్నాడు.

"అదా...అదా...!"

ఆయన గొణుగుతున్న దేమిటో తెలీక చెవియొగ్గేను. కాని, యింత లోనే సభాస్థలం సమీపించటంతో నలుగురూ మా చుట్టూ పోగయ్యేరు.

వారిలో కొందరు డాక్టరుగారికి పూలమాలలు వేసి వేదికమీదికి లాక్కుపోయేరు.

నాకెవరూ దండ వెయ్యలేదు. కనీసం ఆసనమన్నా చూపలేదు. చుట్టూ పదిమందీ మూగటంతో డాక్టరుగారు కూడా నా సంగతి మరచి పోయినట్లున్నారు.

లోలోపలే తిట్టుకుంటూ ఓ మూల చతికిలపడ్డాను.

గోష్టి స్థలంలో సిల్కుగుడ్డలవాళ్ళు, చిరుగ్గుడ్డలవాళ్ళు, ముతక గుడ్డలవాళ్ళు, క్రాఫింగులవాళ్ళు, క్రాపులు లేనివాళ్ళు, పిలకలున్నవాళ్ళు అనేకమంది చేరి గుసగుసలాడుకుంటున్నారు.

ఇన్ని రకాల మందల్ని ఒకచోట చేర్చగలిగిన వారి ఐక్యతాభావా నికి ఆనందించేను.

"ఈ గోష్టి ఏ విషయంమీద జరుగుతోంది?" అని ప్రశ్నించేను ప్రక్కనున్న ఓ సిల్కుగుడ్డల వాసన కవిగార్ని.

"అదా! నరక సాంస్కృతికాభివృద్ధికి ఏం చెయ్యాలి? నరక సాహిత్యాన్నెలా ఉద్ధరించాలి? నరక మహాకవిగా ఏ పీనిగ నెన్నుకోవాలి?

అనే విషయాలు చర్చించబోతున్నాం'' అన్నారాయన.

ఇంతలో ఓ యిద్దరు యువకవులూ, మరో యిద్దరు యువ కవయిత్రులూ వేదిక నెక్కి.

పరుల కీర్తికి పొరలి యేడ్వని
కవి కెక్కడ సుఖం కద్దోయ్ !

అంటూ శ్రావ్యంగా గానం చేయసాగేరు.

వాళ్ళేం పాడుతున్నారు ?" అని ప్రశ్నించేను సిల్కు గుడ్డల సెంటువాసన కవిగార్ని.

"అదా ! అది మా సాంస్కృతిక జాతీయగీతం'' అన్నారాయన.

నా తెల్ల మొహాన్ని చూసి కాబోల్ను ఆయన మరింత వివరించేరు.

"మీ కింకా అర్థం గాలేదనుకుంటాను. ఎంత గొప్ప గీతమది ! ఎంతలోతైన భావముందందులో ! పరుల కీర్తికి పొరలి ఏడ్వందే ఆ పరాయివాడిమీద అసూయ ఎలాముంచుకొస్తుంది ? అసూయ రేగినపుడే గదా ఆ పరాయివాడితో పోటీకి దిగేది ! పోటీలలోనేగదా ఉత్తమసాహిత్య సృష్టి జరిగేది !" అని సెలవిచ్చేరాయన.

"ఆహా ! ఈ నరక సాహితీవేత్త లెంతదూరదృష్టి గలవారు" అని నేను పొంగిపోయేను.

పాట పూర్తి కాగానే అధ్యక్షస్థానంలో నున్న డాక్టరుగారు లేచి ఆనాటి కార్యక్రమం ప్రకటించేరు.

ముందు నరక మహాకవి ఎన్నిక చర్చనీయాంశంగా తీసుకోబడింది.

సభలోంచి ఓ కవిగారు లేచి ''వయోవృద్ధులూ, జ్ఞానవృద్ధులూ, కవితా వృద్ధులూనైన పుల్లయ్యకవిగార్ని నరక మహాకవిగా ప్రతిపాదిస్తున్నాను'' అన్నారు.

అందుకు కొందరు చప్పట్లు కొట్టేరు మరికొందరు పిల్లికూతలూ, నక్క అరపులూ పదిలేరు.

ఇంతలో ఓ కవిగారు లేచేరు.

"నేనీ ప్రతిపాదనను చచ్చినా వప్పుకోను. యింతాచేసి పుల్లయ గారు వ్రాసిన కవిత్వం అరవీశడన్నాలేదు. అందువల్ల హారాపదవికి అనర్హులు" అని కూర్చున్నారు.

ఆ వెంటనే యింకొకరు లేచేరు.

"అరవీశడనేది పచ్చి అబద్ధం. పుల్లయ కవిగారు వ్రాసింది కనీసం పావుసేరన్నాలేదు. అందువల్ల ఆయనసలు కవే గాదు. అలాంటపుడు మహాకవిని చేయటం పాపం తప్ప మరేమీగాదు" అని కూర్చున్నారు.

మరొకరు లేచేరు.

మీరంతా అపమార్గంలో ఆలోచిస్తున్నారు. గంగిగోవు పాలు గరిటెడైన చాలునని గదా పెద్దల ప్రవచనము. అంటే గ్యాలను కవిత్వం వ్రాయటంకన్నా గరిటెడు వ్రాయటమే గొప్పవాళ్ళ లక్షణమని రుజువు గావటం లేదా ! కనుక పుల్లయ్యగారు నిస్సందేహంగా మహాకవి"అన్నారు.

మొదట ఖండించినాయన మళ్ళీ లేచేరు.

"ఆ గరిటెడు పాల నిర్వచనం చేసినవాడు గౌరవనీయుడుగాదు. గోచీగుడ్డ వేలాడేసుకుని, స్మశానాల్లో తిరుగుతూ దైవదూషణ చేసినవాడి నిర్వచనాన్ని ప్రమాణంగా అంగీకరించటం తగదు. మేమందుకు ఒడం బడము" అని కూర్చున్నారు.

మరొకరు లేచేరు.

"ఆ గరిటెడు పాలు ఆయన్ను మహాకవిగా సర్వులూ ఏనాడో గుర్తించేరు. యిప్పుడెవడో నిన్నగాక మొన్న పుట్టిన వాడు లేచి యిలా

వాదించటం శోచనీయం. ఆ మాటకొస్తే నిన్న మొన్నటిదాకా ఈ మందంతా గోచీపాత రచయితలే గాదా ! ఈ గోచీశ్వరులిలా సెలవివ్వటం శోచనీయం" అన్నారు.

"కనుక పుల్లయ్య కవిగారు నిస్సందేహంగా మహాకవి" అని పూర్తి చేశారెవరో !

"కాదు" అని అరచేరు కొందరు.

"ఏం, ఎందుకు కాదు ?" అసరిచే రింకొందరు.

ఇంతలో గౌరవనీయునిలా అగుపిస్తున్న ఓ వృద్ధ కవిగారు లేచేరు.

"మీరిలా ఏకీభావంతో లేరుగనుక నేనో పరిష్కార మార్గం చూపుతాను. మన ఎల్లయ్య కవిగారు మణుగులకొద్దీ కవిత్వం వ్రాశారనీ, కీర్తి శేషులైన మన మాజీ నరక చక్రవర్తి గారికి వీరు ప్రియశిష్యులని మీకు తెలుసు. ఒకసారి వీరు తమ కవిత్వాన్ని గురువుగారికి నివేదించగా "మహా కవిత్వం రాసేవాడివి బయలుదేరావుగాని, పోయి పలకా బలపం తెచ్చుకో" అన్నారట. అంటే అంతటివారే వీరి నేనాడో మహాకవిగా గుర్తించారన్న మాట. మనం కూడా గుర్తించి నెత్తి కెక్కించుకోవడం భావ్యం" అన్నారు.

"ఎల్లయి మహాకవి జిందాబాద్" అనరిచా రేవరో ఓ మూల నుండి.

"ఎవడ్రా ఆ మొరిగేది, నోర్ముయ్. పుల్లయ మహాకవి జిందాబాద్" అని అరిచారెవరో మరో మూలనుండి.

కొంచెంసేపు ఈ జిందాబాద్‌లతో సభ గగ్గోలయింది. ఆ ధాటికి పైకప్పుమీది పెంకులు నాలుగయిదు ఎగిరిపడ్డాయి. వాటిలో ఒకటి అధ్యక్ష పీఠంలో ఉన్న డాక్టరుగారి నెత్తిన పడింది.

డాక్టరుగారు బుర్రగోక్కుంటూ లేచారు.

"ఇది వివాదాస్పదమైన విషయం. కనుక, ప్రస్తుతానికి వాయిదా వేసి రెండో విషయం చర్చకు తీసుకుందాం" అన్నారు.

దాంతో అల్లరి సద్దు మణిగింది.

ఇందాకటి ఆ యువకవి, కవయిత్రులు మళ్ళీ లేచి ఆ జాతీయ గీతాన్ని శ్రావ్యంగా గానం చేశేరు.

పాట పూర్తికాగానే ఓ ముతక గుడ్డల కవిగారు వేదిక నెక్కి సులోచనాలు సవరించుకుంటూ చేతిలోని కాగితాల బొత్తిని చదవసాగేరు.

"మన నరక సాహిత్యం సుసంపన్నమైనట్టిది. మనం పుట్టే నాటికే మనకెన్నో మహాకావ్యాలున్నాయి..." అంటూండగానే సభలోంచి ఒకరులేచి, అయ్యా, మనమిక్కడ సమావేశమైంది మన ముత్తాతల మూతుల నేతి వాసనల్ని పీల్చడానికి కాదు. దయచేసి సమకాలీన నరక సాహిత్యాభివృద్ధికి చేయవలసిన కృషిని వివరించండి" అన్నారు.

ముతకగుడ్డల కవిగారు కొంచెం విసుక్కున్నారు.

"నేనా విషయమే చెప్పబోతున్నాను. మన పూర్వీకులిలా ఇంత ఉత్తమ సాహిత్యాన్నిచ్చి కలకాలం ఇవే చదువుకుంటూ, అనువాదాలు చేస్తూ, క్రొత్త క్రొత్త అర్థాలు పీకుతూ, పిల్లకావ్యాలు తయారుచేస్తూ సుఖించమన్నారు. కాని, ఈ కాలపువాళ్ళు వాటన్నింటినీ భోషాణాలో బొద్దింకలకు అప్పగించి ఆకలో, రక్తమో అని గావుకేకలు పెడుతున్నారు. అదే సాహిత్య మంటున్నారు అసలు ఆకలిలో గాని, రక్తంలోగాని ఏం ప్రాస ఉందో, ఏం ఛందస్సు తగలడిందో నా కర్థం గావటంలేదు. ఇదా మన సాహిత్యం పెరగవలసిన తీరు?" అన్నారు.

సభలో హి హి హీలూ, హ హ హాలూ, పిల్లికూతలూ ఎక్కువవు తూండగా ముతక గుడ్డల కవిగారు మళ్ళీ సులోచనాలు సవరించుకుని ప్రారంభించేరు.

"సరే ! అదంతా అలా ఉండనీయండి. కాని, అలంకార శాస్త్రాల్లో మన పెద్దలేం చెప్పేరు ! ఆకలీ, రక్తమూ, మృత్యువూ ఇవేవీ సాహిత్యంలో కెక్కించగూడదని గదా ! అలాంటపుడు అసలిదంతా కవిత్వమెలా అవుతుంది ?" అని మందహాసం చేశేరు.

సభలో ఓ వైపు నుండి చప్పట్లు చెలరేగాయి.

చిరుగ్గుడ్డల కవిగా రొకరు ఆవేశంతో లేచేరు.

"స్వామీ ! తమ సాహిత్య జ్ఞానమలా తగలడటం మా ఖర్మ ! తమరు పూజించి నెత్తినేసుకుని ఊరేగమని సెలవిస్తూన్న సదరు గ్రంథాల నిండా ఉన్నదేమిటి ? శాకుంతలంలో దుష్యంతుడు వేటకు బయలు దేరింది రక్తదాహంతో కాదా ! శకుంతలను వంటరిగా పట్టుకు చెరిచింది ఆకలితో గాదా !" అంటూ గర్జించేరు.

"అంత గొప్ప గ్రంథానికే వంకలు పెడుతున్నావా ? నీకేం తెలుసు, కుర్రకుంకవి. నోర్మూసుకూర్చో" అన్నారు ముతక గుడ్డల కవిగారు.

"నీకేం తెలుసు, ముసలికుంకవి. నువ్వే నోర్మూసుకూర్చో" అన్నారు చిరుగ్గుడ్డల కవిగారు.

ముతక గుడ్డల కవిగారు ఆగ్రహంతో కంపించిపోతూ చేతిలోని కాగితాల బొత్తిసి బలంకొద్దీ గిరవాటేశేరు. అది వెళ్ళి చిరుగ్గుడ్డల కవిగారికి తగలటానికి బదులు ఆ ప్రక్కనే కూర్చున్న సిల్కుగుడ్డల కవిగారి కొకరికి తగిలి ఆయన ఒక్క ఎగురెగిరేరు.

"ఏమిరా ! ముసలికుంకా, నీకు శాస్త్రాలేం తెలుసునని ఎగురుతున్నావు. ముసలాడివిగదా అని నలుగురూ గౌరవంగా చూస్తూంటే కళ్ళు నెత్తి కొచ్చాయా, ఏమిటీ నీవు చదివిన శాస్త్రాలు ? ఏదీ నీవు వ్రాసిన చెత్త ? ఇలా పట్టుకురా చూపుతా కావలసినన్ని బొక్కలు" అంటూ పిడుగులా స్టేజీ వద్దకు ఉరికే రా సిల్కుగుడ్డల కవిగారు.

ముతక గుడ్డల కవిగారు గిజగిజ లాడిపోయ్యేరు.

"నాయనా, సిల్కు గుడ్డలవాడా ! నువ్వంటే నా కెంత ప్రేమ ! నువ్విలా నన్ను నలుగుర్లోనూ పట్టుకుని పరువు తీయదగునా" అంటూ ఆక్రోశించేరు ముతకగుడ్డల కవిగారు.

"ఏడిశావ్, నీ ప్రేమ పొయ్యిలోపెట్టు ! చేతగాక కాళ్ళ బేరాని కొస్తున్నావా ? చౌడప్ప శతకం పరిష్కరించిందెవరను కున్నావు ? ఖబర్దార్" అంటూ లేని మీసం మెలేయసాగేరు సిల్కు గుడ్డల కవిగారు.

ముతకగుడ్డల కవిగారు ఆగ్రహంతో కంపించిపోతూ జేబులోంచి ఓ గాజు బుడ్డి తీసి "నేనే ముతకగుడ్డల కవినౌదునేని..." అంటూ దాన్ని అమాంతం సిల్కుగుడ్డల కవి మీదికి విసరేరు.

కాని, ఆయన ఆ ప్రమాదం గ్రహించి ప్రక్కకు తప్పుకోవడంతో అది వెళ్ళి ఓ మూలపడి పగిలి అందులోంచి పొగలూ, సెగలూ రాసాగేయి.

మరుక్షణం సిల్కు గుడ్డల కవిగారు లంకమీదికి దూకిన ఆంజనేయుల వారిలా వేదికమీదికి లంఘించేరు.

ఆ వెనుకనే సభలోని వారంతా కేకలు వేసుకుంటూ చెప్పులుతీసి చేత పట్టుకుంటూ, గోచీలు బిగించి చొక్కా చేతులు మడుస్తూ, పెన్నులు

తీసి పాళీల పదును చూసుకుంటూ ఒకరిమీది కొకరు దూకసాగేరు

పరిస్థితులు గ్రహించి నామీది కెవడూ దూకకముందే నేనే బుద్ధిగా ఒక్క అంగలో బయటకుదూకి పలాయనం చిత్తగించేను.

## 7

"నరకాభివృద్ధిని గురించి ఓ వంద పేజీల రిపోర్టును తయారు జేయాలి" అన్నాడు యమధర్మరావు ఓ రోజు ప్రొద్దున్నే.

"ఎవరు... నేనా ? అన్నాను ఆశ్చర్యంతో.

"అవును, నువ్వే. వారంటుగా అది నా కందజేయాలి. ఆ రిపోర్టును యమ సభకు సమర్పించటం కోసమని కాస్త గుర్తుంచుకుని మరీ తయారు జేయి !'' అన్నాడు యమధర్మరావు.

''నేను వచ్చి ఇంకా వారం రోజులన్నా కాలేదే ! మీ యీ నరకాన్ని గురించి ఏం తెలుసునని వ్రాయమన్నావు ?"

యమధర్మరావు పగలబడి నవ్వేడు.

''నాయనా నువ్వున్నది నరకమని గుర్తుంటే చాలు. ఈ మాత్రం పనికి నాలుగు నెల్ల అనుభవం కావాలా ? నీవు ఇక్కడికి రాకముందు మంచి మంచి పుస్తకాలు చాలా చదివి వుంటావు గదా ! వాటిల్లోని వర్ణనలతో ఓ మంచి రిపోర్టు తయారు జేసెయ్ ! సరిపోతుంది'' అన్నాడు.

''అబ్బే ! నా కా అలవాటు లేదు. అంత తెలివితేటలే వుంటే ఇక్కడి కెందు కొద్దును ? స్వర్గానికే పోయుందును గదా !"

యమధర్మరావు విసుగ్గా నావంక చూసేడు.

''ఇలాగయితే భవిష్యత్తులో నీవు రాజకీయ వేత్తగా ఎలా రాణించ గలవో నాకు అర్థం గావటం లేదు'' అన్నాడు.

"మరి నన్నేం చేయమన్నావు ?"

"చెప్పానుగదా, నిజమాడితే నిష్ఠూరమనేది అనుభవహీనులు చెప్పిన ప్రవచనమేమీ కాదే ! అలాంటప్పుడు నిజం చెప్పి చివాట్లు పడాల్సిన ఖర్మ మనకేమిటి ?" అన్నాడు.

అయినా అలవాటులేని పని చేయలేక మర్నాడు యమధర్మరావు తాలూకు అరడజనుమంది సెక్రటరీల్లో ఒకణ్ణి వెంటేసుకుని నరక పర్యటనకు బయలుదేరాను.

మా కారు మెత్తగా పరుగెడుతూ కొద్ది క్షణాల్లోనే రాజధాని శివార్లకు చేరుకుని పడుతూ, లేస్తూ నడవసాగింది.

"ఇదేమిటి, ఈ లెక్కన మనం నరక పర్యటన పూర్తి చేసేదెప్పుడు, నేను రిపోర్టు వ్రాసేదెప్పుడు ?" అని హెచ్చరించేను కారు నడుపుతున్న సెక్రటరీని.

"ఏం చెయ్యమన్నారు, రోడ్డిలా తగలడిందండీ" అన్నాడతను విసుగ్గా.

ఇంత సేపూ పరిసరాల మీదనే కేంద్రీకరించి ఉన్న చూపును ఈసారి రోడ్డుమీదికి పోనిచ్చేను.

"నిజమే, రోడ్డు ఏమంత బాగుండలేదు. దారినిండా గోతులూ, గుంటలూను.

"రాజధానిలో అద్దాల్లాంటి రోడ్లేసుకో గలిగిన మీకు ఇదేం ఖర్మమయ్యా ?" అని ప్రశ్నించేను.

అతను వింతగా నావంక చూశేడు.

"అసలు పల్లెటూళ్ళకు రోడ్లెందు కండీ ?" అన్నాడతను.

ఇతను హోదా రీత్యా నాకన్నా రెండు మూడుమెట్లు క్రిందివాడు. ఇలా ఎదురు ప్రశ్న వేయటంతో నాకు చిరాకువేసింది.

"మరయితే మనం ఇప్పుడు వెళ్తున్న ఈ రోడ్డెందుకు వేసినట్లు? నీకున్న మాత్రం తెలివి ఆ వేయించిన వాళ్ళకు లేకనా?'' అని ఓ వాత వేశేను.

"అలాగంటా రేమిటండీ! అసలీ రోడ్డు వేయించాలని మొదట ప్రతిపాదించినవాడిని నేనే గదా! గత ఎలక్షన్లకు ముందు ఈ రోడ్డు వేయించాం."

"మరి ఇంత ఘనకార్యం చేసినవాడివి పల్లెటూళ్ళకు రోడ్లెందు కంటా వేమయ్యా''.

"అవునండీ, అప్పుడంటే మేం పల్లెటూళ్ళకు తిరిగి అలగా జనానికి కాసిన్ని వాగ్దానాలు చేయాల్సిన అవుసరం ఉండేది గనుక వేయించాం. మరి ఇప్పుడు కూడా రిపేర్లకు డబ్బు దండుగెందు కంటారు."

''అయితే మీరెవరూ ఇటువేపులకు రారా?"

అతగాడు నవ్వు దాచుకోడానికే ప్రక్కకు తిరిగాడని నా అను మానం.

"అబ్బే, పొదుపు ఉద్యమం క్రింద ఈ మధ్య మేం చాలా ఖర్చుల్ని తగ్గించుకున్నాం. అయినా ఈ జనాన్ని చూడటానికి పెట్రోలు దండుగెందుకు? కడుపు మండినప్పుడల్లా వాళ్ళే ఊరేగింపులుగా వచ్చి మాకు కనిపిస్తుంటారు గదా.''

"మరి మీ నరకం ఎలా తగలడుతూందో, మీ జనం ఎలా చస్తు న్నారో మీకెలా తెలుస్తుంది?''

"అదేమన్నమాట! ఎలక్షన్లప్పుడల్లా ప్రతి పల్లే పర్యటించి కూపీలు తీస్తూనే ఉంటాము గదాండీ. పైగా యమధర్మరావుగా రసలే దయా స్వరూపులు. వెళ్ళిన చోటల్లా ఊరూరా బావులో, పంపులో, లైట్లో ఏవో వాగ్దానం చేస్తూనే ఉంటారు కూడానూ."

అతనా మాట అంటూండగానే దూరం నుంచి ఏదో సంగీతం లీలగా వినుపించసాగింది. ప్రశ్నార్ధకంగా సెక్రటరీ వంక చూశేను.

''మీ రిప్పుడు నరకాభివృద్ధి కార్యక్రమాల్లో ఒక అపూర్వ ఘట్టాన్ని దర్శించబోతున్నారు'' అన్నాడతను.

మరికొద్దిదూరం పోయాక రోడ్డు ప్రక్కనే ఉన్న విశాల మైన పొలాలమధ్యగా బృందగానం చేస్తూన్న ఓ రైతుల గుంపు కనుపించింది.

కారాపి సెక్రటరీ నన్నావేపుకు తీసుకుపోయేడు.

అక్కడున్న వాళ్ళంతా సామాన్య రైతులని వాళ్ళ వాలకాలు చూస్తుంటేనే తెలుస్తోంది. వాళ్ళ మధ్యగా వున్న ఒక వ్యక్తి మాత్రం పల్లెటూరి వాడిలా లేడు. చూడగా చూడగా అతను వాళ్ళందరికీ సంగీత శిక్షణ ఇస్తూన్నవాడిలా ఉన్నాడు.

ఏమిటన్నట్లు చూశేను.

సెక్రటరీ మహాశయుడు మందహాసం చేశేడు.

"మా నరక భూముల్లో పండే పంట మా జనాభాలో సగం మంది కేనా చాలటం లేదు. ఇదో పెద్ద బెడదగా ఉంది. అందుకని ఉత్పత్తిని అధికం చేయగల అవకాశాలకోసం అన్వేషించగా, పన్నెండేళ్ళపాటు సుదీర్ఘ పరిశోధనలు చేయగా తేలిందేమిటంటే పొలాలకు సంగీతమంటే చాలా ఇష్టమట! సంగీతం వినిపిస్తే పొలాలు బాగా ఏపుగా పెరుగు

తాయట. ఆ వచ్చేపంటను దాచుకోడానికి క్రొత్తగా గాదులు కట్టవలసి వస్తుందట. అని మా నరక వ్యవసాయ నిపుణులు సెలవిచ్చేరు. దాన్ని తక్షణం అమలులో పెట్టేం. అదిగో వాళ్ళంతా ఇప్పుడు సంగీత వ్యవసాయం చేస్తున్నారు. అదీ సంగతి'' అన్నాడతను.

క్షణమాగి "ఎలా ఉందంటారు ?" అని ప్రశ్నించేడతనే.

నాకు సంగీతజ్ఞానం పూజ్యం. వాళ్ళు ఆలాపిస్తున్నది ఆనంద భైరవో, విషాదభైరవో కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాన్నేను.

అందువల్ల మర్యాదగా తలాడించి ఊరుకున్నాను.

వాళ్ళుమాత్రం విడవకుండా రాగాలాపన చేస్తున్నారు .

సెక్రటరీ మహాశయుడు ఆ సంగీతానికి తన్మయుడై గాబోలు తలూపుతూ మెల్లిగా చిటికెలు వేయసాగేడు.

ఇంతలో రసభంగ మయింది.

ఎక్కడివో ఓ నాలుగు గాడిదలు ఓండ్ర పెడుతూ పరుగెత్తుకొచ్చి మా చుట్టూ ప్రదక్షిణం చేయసాగేయి.

వెనకటికి శ్రీకృష్ణ పరమాత్ముడు తనగానంతో గోవుల్ని, గోపికల్ని కూడా ఆకర్షించేవాడని నేను చదివి ఉన్నాను. కాని, గాడిదల్లాంటి అల్ప జీవుల్ని సైతం ఆకర్షించి తన్మయతలోకి దింపగలిగిన ఆరైతు బృందాన్ని ఆశ్చర్యంతో తిలకించసాగేను.

ఇంతలో ఓ ఇద్దరు చాకళ్ళు ఒగరుస్తూ ఇటు పరుగెత్తు కొచ్చేరు.

"మీకేం బుద్ధిలేదురా, మీరు వచ్చింది చాలక గాడిద లన్నికూడా ఇలాంటి కచేరీలకు తోలుకు రావడమా" అని సెక్రటరీ మహాశయుడు వాళ్ళమీదకు ఎగరసాగేడు.

''మాకేం తెలుసు సామీ, మా గాడిదలిలా ఎన్నడూ మూటలు పడేసి లగెత్తుకుపోలేదు. చూడగా చూడగా మీ యవ్వారం అంతా వింతగా ఉండాదే" అంటూ మొగాలు వేలవేశేరు వాళ్ళు.

సెక్రటరీ మహాశయుడు చల్లబడిపోయేడు. గీతోపదేశం చేయ బోతున్న శ్రీకృష్ణ పరమాత్ములవారి భంగిమలో వారి కతను ఉపన్యాస మివ్వసాగేడు.

"అవును. వింత సంగతేనోయ్! ఇది మన నరక వ్యవసాయ చరిత్రలో ఓ మహత్తర పరిణామం. మే మిప్పుడు సరి కొత్త పద్ధతులో వ్యవసాయం చేయిస్తున్నాము" అన్నాడు.

"ఏందది సామీ" అన్నాడు వాళ్ళలో ఒకడు.

''కనపడటం లేదుటోయ్! ఇకమీదట పొలాలకు సంగీతం విని పిస్తేచాలు, బ్రహ్మాండంగా పండి ఊరుకుంటాయి" అన్నాడతను.

"అయితే పొలాలు దున్ననక్కర్లే దంటారేంటి?" అన్నాడా చాకలి విస్మయంతో.

సెక్రటరీ మహాశయుడు బుర్ర గోక్కుని ఆలోచించి, ఆలోచించి చివరి కా రైతుల్లో ఒకడిని పిలిచి ఏదో అడిగేడు.

"మా కా సంగతేమీ చెప్పలేదండీ! పొలాలకు సంగీతం వినిపించ మని మాత్రం సెల విచ్చేరు. అందుకని మేం దున్ననూలేదు, విత్తనాలూ వేయలేదు. నెల్లాళ్ళుగా ఇలా పాడుతూ కూర్చున్నాం" అన్నాడా రైతు.

సెక్రటరీ మహాశయుడు ఆకాశంకేసి చూస్తూ ఆలోచించ సాగేడు.

ఆ చాకలివాళ్ళు గాడిదల్ని తోలుకుంటూ వెనక్కి మళ్ళేరు.

"ఎదవ నాయాళ్ళు! సంగీత యవసాయమంట బుద్ధి గడ్డి నమిల్తే

సరి" అన్నాడు వాళ్ళలో ఒకడు ఇంకొకడితో నెమ్మదిగా.

"ఆళ్ళబొంద. మన సెరువుగట్టుని అంతనేలా ఊరికే పండిలేదురా, అక్కడ దున్నుకోక ఇదేంపిచ్చ వీళ్ళకి" అన్నాడు రెండోవాడు.

వాళ్ళు దూరంగా పోవటంతో మిగతా మాటలేవీ నా చెవిదాకా రాలేదు.

అర ఘడియ తరువాత సెక్రటరీ మహాశయుడు ఆలోచనలోంచి తేరుకున్నాడు.

నేను రాజధానికి వెళ్ళాక పొలాలు దున్ని మరీ సంగీతం వినిపించాలా? దున్నకుండానే గర్భాదానం చేయాలా? అనేది విచారించి మీకు కబురు చేయిస్తాను. అందాకా మీ రిలాగేగాన సాధన చేస్తూండండి" అన్నాడా రైతులతో.

"బాబ్బాబు, మీకు పుణ్యముంటుంది. మాకా చెరువు క్రింద ఖాళీగా పడున్న పొలా లిప్పించండి. శుభ్రంగా బ్రతికిపోతాం. ఈ సంగీతాలతో చస్తున్నాము. చూడగా చూడగా పిచ్చికూడా ఎక్కేలా ఉంది" అన్నారా రైతులు దీనంగా.

"అబ్బె, అదేం వీల్లేదు. మీ ప్రయోగ ఫలితాల కోసం యావత్ నరకమూ ఎదురు చూస్తోంది" అన్నాడు సెక్రటరీ మహాశయుడు.

వాళ్ళు నోర్మూసుకుని తిరిగి బుద్ధిగా గాన సాధన చేయసాగేరు.

ఆ సంగీతానికి తన్మయుడై గాబోలు సెక్రటరీ మహాశయుడు మరో అరగంటకు గాని అక్కణ్ణించి కదలలేదు.

కారు స్టార్టు చేస్తూ "ఇది గొప్ప మార్పు కదండీ, అసలీ మార్పులు సాధించడానికి మేమెంత కష్టపడాల్సి వచ్చిందనుకున్నారు? అన్నాడాయన.

"ఏమిటవి ?'' అని ప్రశ్నించేను.

''మొదట మా నరక వ్యవసాయాభివృద్ధిని గురించి సర్వేచేసి రిపోర్టిచ్చేందుకని ముగ్గురితో ఓ కమిటీ వేశేము. వాళ్ళు ముగ్గురూ మూడు రకాలుగా అభిప్రాయా లిచ్చేరు. ఒకడు బంజర్లు దున్నాలన్నాడు. ఇంకొకడు మన నరక భూముల వైశాల్యం తక్కువగనుక భూముల్నేకాక కాలువల్నీ, నదుల్నీకూడా దున్నాలన్నాడు మూడో వాడేమన్నాడంటే, మనుషులకీ, చెట్లకీ ప్రాణమున్నట్లే భూమికి కూడా ప్రాణం ఉంది. అందువల్ల అసలు పొలాల్ని దున్నటమే పాపం. ఇప్పుడు చేస్తున్నది చాలక ఇంకా బంజర్లను కూడా దున్నటం మొదలెడితే మరింత పాపం చుట్టుకుంటుంది. కనుక, మనమంతా వ్యవసాయం వదిలేసి కేవలం గాలీ, నీళ్లూ తిని సరిపెట్టుకోవటం మంచిదన్నాడు. అందుమీదట ముగ్గురికీ ముష్టి యుద్ధం జరిగింది

''అప్పుడేం చేశారు ?''

''ఏముంది ! వాళ్ళ కందరికీ తలో 'నరకశ్రీ' బిరుదూ పారేసి అ గోల సర్దేశాం. ఇదిలా ఉండగా ఓ మహానుభావుడు 'భూదేవిని దున్నటం పాపమనేది వాస్తవమే. కనుక సంగతంతో భూదేవికి గర్భాదానం చేయండి. మంచి పంటలు పుడతాయి. అలా జరక్కపోతే నేను గెడ్డం గొరిగించుకుంటాను. గోళ్ళు గిల్లుకుంటాను ! అని ఘోర ప్రతిజ్ఞలు చేశాడు. అ సలహా భేషుగ్గా ఉందని చాలామంది మెచ్చుకున్నారు. అదీగాక సంగీతంలో రసాయనిక ఎరువుల్ని మించిన గుణాలు చాలా ఉన్నాయని గొప్ప గొప్ప శాస్త్ర వేత్తలు కూడా శెలవిచ్చేరు. అందువల్ల ఇంతకాలంగా మా నరక వ్యవసాయాన్ని యాంత్రికం చేయాలని నానా తిప్పలూ పడు

తున్న వాళ్ళమల్లా ఈ సలహాతో హమ్మయ్య అనుకుని ఇహ సంగీతికం చేయాలని నిశ్చయించి అందుకు శతవర్ష ప్రణాళికను రూపొందించేం !" అన్నాడతను.

"కాని, ఇందాక మనం చూసినచోట పైర్లేమీ ఉన్నట్లు లేవే ?" అని నా సందేహాన్ని వెలిబుచ్చేను.

సెక్రటరీ మందహాసం చేసేడు.

"మీరు విజ్ఞులు. విప్లవాత్మకమైన సంస్కరణలు ఒక పట్టాన అమలులోకి రావనే సంగతి తమకు తెలియనిది కాదు గదా ! ఈ మార్పుకు భూదేవి అంగీకరించటానికి కొంత వ్యవధి కావద్దా !" అన్నాడతను.

"అవునవును !" అన్నాను.

"అలా కొంతదూరం ప్రయాణించగా దార్లో ఓ యిద్దరు పెద్ద మనుష్యులు ఓ పిల్ల కాలవ ఒడ్డున జుట్టూ జుట్టూ పట్టుకుని ముష్టియుద్ధం చేస్తూ ప్రత్యక్షమయ్యేరు. వాళ్ళ చుట్టూ ఓ మంద మూగి వుంది. అందులో పెద్దమనుషుల్లాంటి వాళ్ళు చాలామంది ఉన్నా వారెవరూ పట్టించుకోకపోగా తమాషా చూస్తూ, కేరింతలు కొడుతూండటం చూసి ఆశ్చర్యపోయేను.

ఏమిటన్నట్లు సెక్రటరీ వంక చూడటం, ఆలస్యంగా అతను సిగ్గుతో నత్తుతూ, నత్తుతూ ఇలా చెప్పసాగేడు.

"అదేమంత విశేషం కాదులెండి ! వాళ్ళిద్దరూ మా వినాయకరావు గారి తమ్ముళ్ళే ! ఒకరు ఆ ఎగువనున్న ఊరికి పెద్దయితే మరొకరు ఈ దిగువనున్న పల్లెకు తిరుగులేని నాయకుడు. వీళ్ళు అడపా దడపా అజీర్తి చేసినప్పుడల్లా ఇలా షికారు కొచ్చి ఈ కాలవ నీళ్ళకోసం తగాదా పడు తూండటం మామూలే !" అన్నాడతను.

"మందికి చెందిన కాలవ నీళ్ళకోసం అన్నదమ్ములిలా తన్నుకోవడ మేం ఖర్మమయ్యా ?"

''దాందేముంది లెండి ! ఊళ్లోవాళ్ళకు తమకింకా నాయకుడంటూ ఒక డున్నాడని గుర్తుచేస్తూండకపోతే ఎలాగ ! అయినా ఇదంతా ఇక్కడే గాని పీక్లు తీరా ఇళ్ళకు చేరగానే 'ఒరే అన్నా' అంటే 'ఏంరా తమ్ముడూ' అంటూ వాటేసుకుంటూంటారు. మనమదేం పట్టించుకోనక్కరలేదు" అన్నాడు సెక్రటరీ మహాశయుడు అనుభజ్ఞునిలా.

అలా ఆ పూటంతా ప్రయాణం చేసీ, చేసీ చివరకు ఓ పెద్ద నదీ తీరానికి చేరుకున్నాం.

దూరాన కొన్ని వేలమంది ఆడా, మగా ఏదో కొంపలు మునిగే టంత అడావిడి పనిలో మునిగి ఉన్నారు.

మేమింకా ముందుకుపోయి అక్కడ ఆగాం.

మా కారు ఆగీ ఆగకముందే ఓ నలుగురయిదుగురు పెద్దలు బొజ్జలు గోక్కుంటూ పరుగెత్తుకొచ్చి సెక్రటరీ మహాశయుడికి స్వాగత మిచ్చి దూరంగా తీసుకుపోయి ఏవేవో మంతనాలాడసాగేరు.

నేను కొంచెం ముందుకుపోయి అక్కడి జనం చేస్తున్న పనిని పరిశీలించసాగేను.

ఒకచోట కొందరు కూలీలు రాళ్లు పగలగొడు తున్నారు.

వాటిని తీసుకుపోయి ఆ నది కడ్డంగా పడేస్తున్నారింకొందరు.

మరికొందరు వాటిమీద మట్టి గుమ్మరించి సాపుచేస్తున్నారు.

మొత్తంమీద ఆ నది కడ్డంగా ఆ రాళ్ళతోనూ, మట్టితోనూ ఓ పెద్ద అడ్డుకట్ట తయారవుతున్నదనే విషయం నే నర్థం చేసుకోగలిగేను.

ఇంకొంచెం ముందుకు నడిచేను.

ఒకచోట కొందరు ఇసుకలో సిమెంటు కలిపి, అందులో మళ్ళీ సున్నం, మట్టివేసి ఏదో క్రొత్త పదార్థాన్ని సృష్టిస్తున్నారు.

ఆ వినూత్న పదార్థాన్ని తీసుకువెళ్ళి ఆ అడ్డుకట్ట మీద గుమ్మరించి రాళ్ళూ, మట్టీ కనపడకుండా నున్నగా సాపు చేస్తున్నా రింకొందరు.

ఆ తతంగమంతా ఏమిటో నా కర్థంగాక ఆశ్చర్యంతో చూస్తుండిపోయేను. అలా ఎంత సేపున్నానో! సెక్రటరీ వచ్చి భుజం తట్టేటప్పటికి ఉలిక్కిపడ్డాను.

"చూశారుగదాండీ! ఇది మా నరక నిర్మాణాలలో కెల్లా పెద్దదీ, గొప్పదీనూ! ఇంత గొప్ప ప్రాజెక్టు ప్రాచ్య నరకాల్లో మరెక్కడా లేదు కూడాను!" అన్నాడతను.

"ఏమిటీ! ఇది ప్రాజెక్టా?" అన్నా న్నే నాశ్చర్యంతో.

"కాక, మరేమంటారండీ! బహు కొద్దికాలంలోనే దీన్ని పూర్తి చేయగలిగాం కూడాను. ఈ ప్రాజెక్టువల్ల సోదర నరకాల్లో మా ప్రతిష్ఠ పెరగటం మాట అలా ఉంచి వచ్చే ఎన్నికల్లో మేం గెలవటం మాత్రం ఖాయం!" అన్నాడతను.

తరువాత అతనా ప్రాజెక్టును గురించి నాకు వివరించ సాగేడు. ఈ నిర్మాణ ఫలితంగా కొత్తగా కొన్ని వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇది మా యమ ప్రభుత్వానికే గర్వ హేతువు! నిజానికి ప్రతిష్ఠ అంతా యమధర్మరావుగారికి చెందాల్సి వుంటుంది. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన డబ్బును వారు శాంక్షన్ చేయించగా, వారి బంధువులైన కంట్రాక్టర్లంతా కలిసి ఇంత స్వల్ప కాలంలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అందువల్ల

ఇందుకు సంబంధించిన సమస్త ఖ్యాతీ యమధర్మరావుగారికే చెందాల్సి ఉంది!" అన్నాడతను ఉపన్యాస ధోరణిలో.

"ఏమాత్రం ఖర్చు పెడుతున్నారు?" అని ప్రశ్నించేను.

"మొదట ఏభై కోట్లు శాంక్షన్ చేశాం. కాని, ఆ తర్వాత అసలీ ప్రాజెక్టు కట్టాలా? వద్దా? అనే ఆలోచనలో పడ్డాం. ఆలోచించినందుకు అయిదు కోట్లు, ఆలోచించటం త్వరగా పూర్తిచేసినందుకు మరో అయిదు కోట్లు ఖర్చయ్యేయి. తర్వాత శంఖుస్థాపనలకూ, ప్రచారానికీ మరో పది కోట్లు ఖర్చయ్యేయి. మిగిలిన ముప్ఫై కోట్లతో "మీ యిష్టం! ఎలాగోలా తిప్పలుపడి పూర్తి చేయించండయ్యా" అని మా యమధర్మరావు గారు వారి చుట్టపక్కాల్ని పిల్చి ఈ కాంట్రాక్టులన్నీ వారి కప్పగించేరు. వారయినా నరకంపట్ల భక్తీ, గట్రా ఉన్నవారు గనుక సరేనని ఒప్పుకుని ఆ ముప్ఫై కోట్లతోనే ఇంత త్వరలో పని పూర్తిచేశేరు!" అన్నాడతను.

"ఎప్పటికిది పూర్తవుతుం దనుకుంటున్నారు?" అని ప్రశ్నించేను.

"ఎప్పుడో ఏమిటి? అప్పుడే పూర్తయితేను. రేపు యమధర్మ రావుగారు ప్రారంభోత్సవం చేయబోతున్నారు కూడాను!"

క్షణం నివ్వెరపోయినా యమధర్మరావు యిలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలపట్లకూడా శ్రద్ధకలిగి ఉన్నాడుగదా అని ఆనందించేను.

మర్నా డుదయంనుండే ఆ ప్రాజెక్టు స్థలమంతా బ్రహ్మాండంగా అలంకరించసాగేరు. ఒకటొకటిగా వందలాది కార్లు, వాన్లు రాసాగేయి. మంత్రులతో, ఇంజనీర్లతో, రాజకీయవేత్తలతో ఆ స్థలమంతా కళకళ లాడసాగింది. నరక ప్రముఖుల్తో పరిచయాలు చేసుకోవటానికి నాకు మంచి అవకాశం దొరికింది.

సాయంత్రం జరిగిన ప్రారంభోత్సవ సభకు నరక పెద్దలూ, పౌరులూ అసంఖ్యాకంగా హాజరయ్యేరు. వాళ్ళందరి చూపూ డాముమీదా, డాము వెనుక రిజర్వాయరుమీదా, అక్కణ్ణించి బయలుదేరిన కాలువలమీదా ఉన్నాయి. ఆ చూపుల్లో ప్రతిఫలిస్తున్న ఆశా, ఉత్సాహాలను చూసి నేనూ పొంగిపోయేను.

యమధర్మరావు ప్రారంభోత్సవానికి ముందు రెండున్నర ఘడియలపాటు ఆశువుగా అమోఘమైన ఉపన్యాస మిచ్చేడు. సభలో అడుగడుగునా చప్పట్లు చెలరేగేయి. ఆ సమయంలో యమధర్మరావులో రేగిన ఉత్సాహాన్ని అంచనా వేయటానికి నేను అసమర్థుణ్నయ్యేను.

పద్నాలుగు ప్రపంచాల్ని జయించి పాదాక్రాంతం చేసుకున్నవాడి ఠీవితో, ధీమాతో యమధర్మరావు వేదిక దిగి ముందుకు నడిచేడు.

మైక్‌లో ఎవరో చెప్పేరు.

"గౌరవనీయులైన యమధర్మరావుగారిప్పుడు ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇంకా ఒక్కక్షణంలో శ్రీవారు ఆ వేదికమీది మీటను నొక్కగానే కాలువల్లోకి నీరు ప్రవహించ నారంభించి నరక భూములను సస్యశ్యామలం చేయనున్నవి!" అని గంభీర స్వరంతో ప్రవచించేరు.

ఆ రెండో వేదికవద్ద కొద్ది క్షణాలపాటు సద్బ్రాహ్మణుల వేద ఘోషతో, పగిలే టెంకాయల చప్పుళ్ళతో ఒక పవిత్ర వాతావరణం సృష్టించ బడింది.

ఆ తతంగం ముగియగానే యమధర్మరావు బహు ఠీవిగా, సున్నితంగా, మందహాసా లొలికిస్తూ ఆ మీటను నొక్కేడు.

మరుక్షణం ఏకకాలంలో నూరు ఫిరంగులు గర్జించినట్లు, దూరంగా ఎక్కడో అటంబాంబు ప్రేలినట్లు బ్రహ్మాండమైన చప్పుడయింది. నేను నిల్చున్న భూమే దద్దరిల్లిపోయింది.

అక్కడ చేరిన పౌరులంతా కకావికలై చెల్లాచెదు రయ్యేరు. ఎవ డికి తోచిన దిక్కుగా వాడు కాలికొద్దీ పరుగు పుచ్చుకున్నాడు.

నేను తమాయించుకుని కళ్లు తెరిచి చూసేసరికి యమధర్మరావు నన్ను వాటేసుకుని ఉన్నాడు. నా గుండెలకు అదుముకుని వున్న అతని గుండె ఆ క్షణాన ఎంత వేగంగా కొట్టుకుంటూన్నదనే విషయాన్ని నేను అంచనా వేయలేక పోయేను.

యమధర్మరావుని వదిలించుకుని, జరిగిందేమిటా అని పరిశీలించేను పరిశీలించి విభ్రాంతుణ్ణయ్యేను. కలా నిజమా ? అని సందేహించేను.

క్షణం క్రిందట అక్కడ ఆ నదికి అడ్డంగావున్న ఆ డాము ఆనవా లేనా కనుపించటం లేదు.

ఇంతలో కొందరు ఆఫీసర్లు, ఇంజనీర్లు, కంట్రాక్టర్లు పరుగెత్తుకొచ్చి యమధర్మరావు చుట్టూ మూగేరు.

యమధర్మరావు ఆ క్షణాన అచ్చంగా యమధర్మరాజులాఉన్నాడు అంత ఉగ్రరూపాన్ని నేనెన్నడూ చూడలేదు.

"ఏమిటీ ఇదంతా ?" కనుపించని డామువంక వేలెత్తి చూపుతూ ఉరిమేడు యమధర్మరావు ఆగ్రహావమానాలతో కంపించిపోతూ.

కొందరు బుర్రలు గోక్కున్నారు. మరికొందరు బొర్రలు గోక్కు న్నారు. ఇంకొందరు జుట్టు పీక్కున్నారు.

"ఏమో ! అంతా మాయగా ఉంది ! అన్నాడో కంట్రాక్టరు.

"అయినా ఇంత తొందరగా కొట్టుకుపోతుం దనుకున్నామా ?" అన్నా డింకో కంట్రాక్టరు.

"మా తప్పేంలేదు. కంట్రాక్టర్లే సిమెంటంతా అమ్ముకుని ప్రాజెక్టంతా మట్టితో కట్టేరు." అన్నాడో ఇంజనీరు

"పట్నంలో వాళ్ళ మేడలు కట్టుకోవటంలో ఉన్న శ్రద్ధలో సగమన్నా ఇక్కడ చూపితేనా !" అన్నాడు మరో ఇంజనీరు.

"అంతా ఖర్మ !" అన్నాడో రాజకీయవేత్త.

యమధర్మరావు తల పట్టుకొని చతికిల పడ్డాడు.

కొద్ది క్షణాల తర్వాత ఇంజనీర్లను మాత్రం ఇవతలికి పిలిచి అందర్నీ అవతలకి పొమ్మన్నాడు.

"ఇప్పుడేం చెయ్యటం ?" ప్రశ్నించేడు యమధర్మరావు నుద్దేశించి.

"మేమేం చెయ్యమండీ ! కంట్రాక్టర్లు చచ్చుగా కట్టేరు. ఎంత డబ్బూ, ఎంత సిమెంటూ దిగమింగారో లెక్కేలేదు !" అన్నారు వాళ్ళంతా ఏకగ్రీవంగా.

"ఛత్ ! నోర్ముయ్యండి ! వాళ్ళంతా నా దగ్గరి బంధువులని మరచిపోయారా ! మా వంశాల్లో అలాంటి దెన్నడూ లేదు. లక్షలు మాకు గడ్డిపరకలు. మొన్నటి ఎలక్షన్లలో వీళ్ళంతా రెండు చేతులా చందాలు వేశేరు !" అన్నాడు యమధర్మరావు కోపంతో.

వాళ్ళంతా గజగజలాడిపోయేరు.

కొద్ది క్షణాల తరువాత వారిలో ఒకరు ముందుకు వచ్చేరు.

"అసలు సంగతి అదికాదండీ ! ఎన్నడూ రానంతగా వరదలొచ్చేయి. ఆ తాకిడికి డాము తట్టుకోలేక కొట్టుకుపోయింది !" అన్నాడతను.

మిగతా ఇంజనీర్లంతా వింతగా అతనివంక చూశేరు.

యమధర్మరావు మరింత వింతగా అతన్ని వీక్షించేడు. మరుక్షం చిరునవ్వుతో అతని భుజం తట్టేడు.

"నువ్వయ్యా! ఇంజనీరువంటే! ఎంత పసందైన కారణం కని పెట్టేవు! నీకున్న తెలివితేటల్లో వందోవంతన్నా వీళ్ళకు లేకపోయింది గదా! విన్నారుగదుటయ్యా మీరంతా! ఇకమీదట ఎవరడిగినా ఈకారణమే చెప్పండి!" అంటూ యమధర్మరావు ఆర్డర్లు జారీ చేశేడు.

వాళ్ళంతా "జీ హుజూ" రంటూ చేయెత్తి జోహార్లు పలికేరు

మరికొద్దిసేపటి తర్వాత నన్నూ, యమధర్మరావునూ మోసు కుంటూ మా వాహనం యమపురి కభిముఖంగా పరుగెత్తసాగింది.

నేను తయారు చేయవలసిన రిపోర్టును గురించి ఆలోచిస్తున్నాను.

నేను ఆలోచిస్తున్నాను... (1960)

★